నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శుక్రవారం | మే 24, 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ కుర్రెఘడ్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ పున్నం చందు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..కుర్రెఘడ్ వెంకటాపూర్ గ్రామానికి చెందిన పెంద్రం చిలుకు(55)తో పాటు వరుసకు తమ్ముడైన కోట్నాక గణేష్(24) ఇద్దరు కలిసి కొండాపూర్ వేప నుండి వెంకటాపూర్‌కు బైక్‌పై వస్తున్నారు. మార్గ మధ్యలో వెంకటాపూర్ గ్రామ శివారులోని డంపింగ్ యార్డ్ దగ్గరలో అటు వైపుగా వెంకటాపూర్ నుండి మల్కెపల్లి వైపు వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలతో పెంద్రం చిలుకు అక్కడికక్కడే మృతి చెందగా కోట్నాక గణేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం మంచిరాల ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ జుగ్నక యశ్వంత్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఢీ కొనడంతో ప్రమాదం జరిగిందని వివరించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

చీకట్లో ఏరియా ఆసుపత్రి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

రెండు రోజులుగా పట్టణంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి చుట్టూ విద్యుత్ వీధి దీపాలు వెలగక చీకట్లో మగ్గుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. రోగులను పరామర్శించడానికి వచ్చే ఆసుపత్రి ఆవరణలో చీకటిగా ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు చిమ్మ చీకట్లో భయభ్రాంతులకు గురవుతున్నారు. వెంటనే విద్యుత్ వీధి దీపాలకు మరమ్మత్తులు చేసి అంధకారం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వియయంపై సంబంధిత అధికారిని వివరణ కోరగా తమకు ఎలాంటి కంప్లైంట్ రాలేదని, వెంటనే ఏరియాకు సంబంధించిన దానిపై మరమ్మత్తులు చేపట్టి విధి దీపాలు వెలిగేలా చేస్తామని తెలిపారు.

అంతా మా ఇష్టం..!

- అచ్చిరాని వైద్యం చేస్తున్న కొంతమంది పీఎంపీ, ఆర్‌ఎంపీలు
- తనిఖీలు నిర్వహిస్తున్నా మారని తీరు

వైద్యాధికారులు, విజిలెన్స్ బృందాలు పీఎంపీ, ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై తనిఖీలు కొనసాగిస్తున్నా కొంత మంది మాత్రం అవేమీ పట్టించుకోకుండా అంతా మా ఇష్టం అనే రీతిలో వైద్యం చేస్తున్నారు. జిల్లాలో అచ్చిరాని వైద్యం చేస్తూ రోగుల ప్రాణం మీదికి తీసుకొస్తున్నారు. కొన్ని రోజుల క్రితం మంచిర్యాల, లక్షెట్టిపేట్‌కు చెందిన పలువురు ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లపై విజిలెన్సు అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్థాయికి మించి వైద్యం చేస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదులు చేశారు. అది మరువక ముందే తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు సైతం పలు ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లు సందర్శించి వారి అర్హత, చేస్తున్న వైద్యంపై విచారణ చేపట్టారు. ఇష్టానుసారం చేస్తున్న వైద్యంపై టీఎస్‌ఎంసీకి ఫిర్యాదు చేశారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని జిల్లా వైద్యాధికారులు ఆర్‌ఎంపీ, పీఎంపీలతో పలుసార్లు సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించారు. అయినప్పటికీ వారి పద్ధతిలో మాత్రం మార్పు రావడం లేదని పలు సంఘటనలు రుజువు చేస్తున్నాయి.



మంచిర్యాల పట్టణంలో ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌లో రోగులు

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో కొంత మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు స్థాయికి మించి వైద్యం అందిస్తున్నారు. ఫలితంగా ఇటీవల చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు వెలుగు చూశాయి. నెన్నెల మండల కేంద్రానికి చెందిన సాయి పల్లవి(12) ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వికటించి మృతి చెందింది. బాలిక తల్లిదండ్రులు ఆ వైద్యుడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక అమ్మమ్మ గ్రామమైన వేమనపల్లి మండలం కేతనపల్లి గ్రామానికి వెళ్లగా రాత్రి 10గంటల సమయంలో కడుపు నొప్పి రావడంతో ఓ ఆర్‌ఎంపీ దగ్గరికి తీసుకెళ్లారు. ఇంజక్షన్ చేసిన గంట తర్వాత నాలుక తిమ్మిరి వస్తుందని బాలిక చెప్పడంతో వెంటనే చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు బాలిక పరిస్థితి విషమంగా ఉందని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా బాలికను



మృతి చెందిన సాయి పల్లవి

పరీక్షించిన వైద్యులు అప్పటికే పాప చనిపోయిందని చెప్పారు. ఆర్‌ఎంపీ ఇంజక్షన్ వేయడం వల్లే పాప చనిపోయిందని, పాపకు జబ్బేమీ లేదని ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో రామకృష్ణాపూర్‌కు చెందిన ఓ ఆర్‌ఎంపీ జ్వరంతో తన దగ్గరికి వచ్చిన 8 సంవత్సరాల బాలికకు హెవీ డోస్ ఆంటీబయోటిక్ ఇంజక్షన్ ఇవ్వడంతో కొద్ది సేపటికే బాలికకు ఫిట్స్‌కు వచ్చాయి. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యం అందించే సమయంలో బాలిక హైబిపితో బ్రెయిన్ డెడ్ అయి చనిపోయింది. లక్షెట్టిపేట్‌కు చెందిన ఓ ఆర్‌ఎంపీపై స్టేట్ విజిలెన్స్ అధికారులు పోలీస్‌స్టేషేలో ఫిర్యాదు చేశారు. అది లెక్క చేయని ఆ ఆర్‌ఎంపీ దాడులు జరిగిన మరుసటి రోజు నుండే ట్రీట్మెంట్ చేయడం తిరిగి ప్రారంభించాడు. ముత్యంపేటకు చెందిన 10 సంవత్సరాల బాలికకు జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు ఆ ఆర్‌ఎంపీకి దగ్గరికి తీసుకెళ్లారు. జాండీస్ అని తేలడంతో వారం రోజుల పాటు బాలికకు ట్రీట్మెంట్ చేశాడు. నయం కాక పోవడంతో అందుబాటులో గల ప్రయివేట్ హాస్పిటల్‌లోని జనరల్ ఫిజీషియన్ దగ్గరికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు జ్వరం, జాండిస్ ఎక్కువ శాతం ఉన్నాయని, ఇన్ని రోజులు లేట్ ఎందుకు చేశారని కుటుంబ సభ్యులను మందలించారు. బాలికను అడ్మిట్ చేసుకొని పూర్తి చికిత్స అందించారు. వారం తర్వాత బాలికకు నయం కావడంతో డిశ్చార్జి చేశారు.

అర్హతకు మించిన వైద్యం

రోగుల ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావాల్సిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు తమ పరిధి దాటి వైద్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి. అర్హత లేకున్నా క్లినిక్‌లు, బెడ్స్ ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారు. ఆంటీబయోటిక్స్ మందులు ఉపయోగిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మరికొందరైతే ఏకంగా ల్యాబ్స్, మెడికల్ షాప్‌లు నిర్వహిస్తున్నారు. ప్రయివేట్ హాస్పిటల్స్ నిర్వాహకులు ఇచ్చే కమిషన్‌లకు కక్కుర్తి పడి కొందరు ఆర్‌ఎంపీలు తమ క్లినిక్‌కు వచ్చే రోగికి అప్పటికప్పుడు చికిత్స అందించి మాయమాటలు చెప్పి ప్రయివేట్ హాస్పిటల్స్‌కు రెఫర్ చేస్తున్నారు. రూల్స్ ప్రకారం ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయలి కానీ చాల మంది ఆర్‌ఎంపీలు హాస్పిటల్స్‌నూ తలపించేలా బోర్డులు ఏర్పాటు చేసి, బెడ్స్ వేసి వారే డాక్టర్‌లుగా చలామణి అవుతున్నారు.



ఆర్‌ఎంపీ, పీఎంపీలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారులు(ఫైల్)

ఇప్పటికైనా మారాలి : అనిత, జిల్లా వైద్యాధికారి



ఆర్‌ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి. అచ్చిరాని వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. క్లినిక్‌లలో డాక్టర్‌లుగా బోర్డులు పెట్టుకొని, బెడ్స్ వేసి ఇష్టం వచ్చినట్లు ఆంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ ఉపయోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. స్థాయికి మించి వైద్యం చేసి ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తే ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. గతంలో చాలాసార్లు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి హెచ్చరించినప్పటికీ మార్పు రావడం లేదు. ఇప్పటి నుండైనా మార్పు తెచ్చుకొని పరిధిలోనే చికిత్స అందించాలి.

సింగరేణి సీఎండీతో ఆస్ట్రేలియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ భేటీ



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి సంస్థ రానున్న ఐదేళ్లలో నిర్దేశించుకున్న 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనకు అవసరమైన ఆధునిక మైనింగ్ టెక్నాలజీ, శాస్త్ర సాంకేతిక విషయాల్లో సహకారం అందించే విషయమై ఆస్ట్రేలియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డెనిస్ ఈటెస్‌తో సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ భేటీ అయ్యారు. గురువారం సింగరేణ భవన్‌లో సింగరేణి ఉపయోగిస్తున్న సాంకేతికత ఈ ఏడాది సాధించిన రికార్డు ఉత్పత్తి, రవాణా, టర్నోవర్ సంస్థ వృద్ధిరేటును ఈ సందర్భంగా సీఎండీ వివరించారు. అదేవిధంగా బొగ్గు ఉత్పత్తితో పాటు వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా థర్మల్, సోలార్ రంగాల్లోకి విజయవంతంగా అడుగుపెట్టిందని వెల్లడించారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర రంగాల్లోని అవకాశాలను పూర్తిగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఆస్ట్రేలియాకు చెందిన సింటార్స్ తదితర సంస్థలతో మైనింగ్, రక్షణ, సాంకేతిక విషయాల్లో సేవలు స్వీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. సింగరేణిలో అమలవుతున్న సాంకేతికతను సంస్థ చేపడుతున్న నూతన వ్యాపార విస్తరణ చర్యలను స్వయంగా చూసేందుకు నవంబర్‌లో ఆస్ట్రేలియా బృందం సింగరేణి ప్రాంతంలో పర్యటించనున్నదని ఆస్ట్రేలియా కమిషనర్ డెనిస్ ఈటెస్ వివరించారు. అలాగే మైనింగ్ రంగంలో నూతన సాంకేతికతలపై తమ దేశంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ ప్రగతికి దోహదపడే అంశాలపై తగిన సహకారాన్ని అవసరమైనప్పుడు స్వీకరిస్తామని సీఎండీ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియా కమిషనర్‌తో పాటు బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ రామకృష్ణ దగ్రాల ఉన్నారు.

వాంతులు, విరేచనాలతో వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-కెరమెరి



వాంతులు, విరేచనాలతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని ఖైరి గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకపుగూడలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్రకు చెందిన గుండి లక్ష్మీబాయి(64) భర్త చనిపోవడంతో ఏడాదిన్నర క్రితం నుండి నాయకపుగూడలో ఉంటోంది. బుధవారం మధ్యాహ్నం అస్వస్థత కారణంగా ఇంట్లోనే ఉంది. అదే రోజు సాయంత్రం వాంతులు, విరేచనాలు అయ్యాయి. బుధవారం రాత్రి వాంతులు, విరేచనాలు ఎక్కువ కావడంతో పరిస్థితి విషమంగా మారి గురువారం మృతి చెందింది. మృతురాలుకు ఐదుగురు కూతుళ్ల, కుమారుడు ఉన్నారు. కుమారుడు, నలుగురు కుమార్తెలకు వివాహం కాగా, చిన్న కుమార్తెకు వివాహం కావాల్సి ఉంది

ఇంద్రనగర్‌లోనూ..

కొన్ని రోజులుగా ఖైరి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంద్రనగర్ గ్రామంలోనూ వాంతులు, విరేచనాలు అవుతున్నాయని సమాచారం. గ్రామంలోని పలువురు వాంతులు, విరేచనాల బారిన పడ్డారు. చికిత్స పొందగా పలువురు కోలుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో వాంతులు, విరేచనాలు తగ్గుముఖం పట్టాయని గ్రామస్తులు తెలిపారు.

ప్రశాంతంగా స్పాట్ అడ్మిషన్లు



ఉట్నూర్: ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రశాంతంగా స్పాట్ అడ్మిషన్లు జరిగినట్లు ఆర్‌సిఓ గంగాధర్ అన్నారు. గురువారం ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో బాలికలకు గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని తొమ్మిది గురుకుల బాలికల కళాశాలలో 550 మంది బాలికలు అడ్మిషన్ల కోసం వచ్చారని తెలిపారు. అందులో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించామనారు. బైపీసీ, ఎంపీసీ,హెచ్‌ఈసి, సిఈసి కోర్సులలో ఒక్క గ్రూప్‌లో 40 సీట్లు ఉంటాయని, అదే ప్రకారం విద్యార్థులను భర్తీ చేస్తున్నామని తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియలో ఏటీడీఓ క్రాంతికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

ఆసిఫాబాద్: వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. నల్గొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ములుగు జిల్లాలో వివిధ మండలాలలో తమ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్నా పూర్తిస్థాయిలో రైతు దగ్గర నుండి ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేయలేకపోతోందన్నారు. రైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో వరి కొనుగోలు చేయకుంటే రైతులకు మద్దతుగా నిలబడతామన్నారు.

ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీఓ, ఇన్‌ఛార్జి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి హరికృష్ణతో కలిసి కొనుగోలు కేంద్రాల ఏఈలు, 3సెక్టార్ల వాహనాల గుత్తేదారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతుల వద్ద నుండి ధాన్యం సేకరించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 136, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 89, మెప్మా ఆధ్వర్యంలో 10, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో 51 వరిధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేయబడిన రైస్ మిల్లులకు సామర్థ్యం మేరకు కేటాయించి లారీల ద్వారా తరలించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో లారీలు, డ్రైవర్ల సర్దుబాటుపై సంబంధిత కాంట్రాక్టర్లు శ్రద్ధ తీసుకోవాలని, అత్యవసర ప్రాతిపదికన రవాణా కోసం వాహనాలను అద్దెకు తీసుకోవలసి ఉంటుందని తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా ధాన్యం తడిచే అవకాశం ఉన్నందున, తరలింపు ప్రక్రియలో వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం సేకరణ కేంద్రాల వారీగా వాహనాల కేటాయింపు కాంట్రాక్టర్లు ఇవ్వడం జరుగుతుందని, సెక్టార్-1లో 50, సెక్టార్-2లో 50, సెక్టార్-3లో 140 చొప్పున మొత్తం 240 వాహనాలు అవసరం ఉందని తెలిపారు. లారీలలో తరలించిన ధాన్యం దిగుమతి సమయంలో హమాలీల కొరత లేకుండా తహసీల్దార్లు తమ పరిధిలో అవసరం మేర సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం, రైతుల బ్యాంక్ పాస్ పుస్తకం, పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు తదితర పూర్తి వివరాలను ట్యాబ్లలో నమోదు చేయాలని తెలిపారు. ట్యాబ్ ఎంట్రీలో అలసత్వం వహించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా సంబంధిత వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు బ్లాక్ లిస్టులో చేర్చుతామని తెలిపారు.

దొంగ బంగారంపై విచారణ



నవతెలంగాణ-మంచిర్యాల

ఉన్నట్టుండి మంచిర్యాల జిల్లాతో పాటు పట్టణంలోని బంగారం దుకాణాలపై పోలీసులు చేస్తున్న విచారణ జిల్లాలో కలకలం రేపింది. జిల్లాకు చెందిన ఒక వ్యక్తి జిల్లాతో పాటు సిద్ధిపేట, హైదరాబాద్‌లో బంగారం దొంగతనం చేసి పోలీసులకు పట్టుబడ్డాడు. బంగారం రికవరీ చేసే ప్రయత్నంలో నిందితుడ్ని విచారించగా, దొంగిలించిన బంగారం మంచిర్యాలలోని బంగారం దుకాణాల నిర్వాహకులకు అమ్మినట్లు తేలింది. రంగంలోకి దిగిన పోలీసులు మంచిర్యాలలోని బంగారం దుకాణాల్లో నిలువ ఉన్న బంగారం, షాప్ నిర్వాహకులపై ఆరా తీస్తున్నారు. అనుమానం ఉన్న వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టే క్రమంలో విషయం తెలుసుకున్న ఇతర గోల్డ్ షాప్‌ల నిర్వాహకులు గత 4 రోజులుగా దుకాణాలు బంద్ చేశారు. జిల్లాకు చెందిన ఓ గోల్డ్ వ్యాపారి మంగళవారం కొంత గోల్డ్ తీసుకొచ్చి మంచిర్యాల పట్టణ గోల్డ్ షాప్ నిర్వాహకులకు అమ్మే క్రమంలో అతన్ని సైతం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. దీనిపై పట్టణంలోని గోల్డ్ షాప్ నిర్వాహకులు గురువారం ఉదయం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దొంగతనం చేసి ఎత్తుకొచ్చిన బంగారాన్ని మంచిర్యాలలోని గోల్డ్ షాప్ నిర్వాహకులకు అమ్మినట్లు వచ్చిన సమాచారం మేరకు గోల్డ్ షాప్‌ల నిర్వాహకులను విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. విచారణలో మంచిర్యాలతో పాటు సిద్ధిపేటకు చెందిన పోలీసు టీంలు కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది. విచారణ జరుగుతున్న నేపథ్యంలో పట్టణంలోని గోల్డ్ తయారు చేసే దుకాణాలు, రెడీమేడ్ జ్యూవెలరీ దుకాణాలు వరుసగా నాలుగు రోజుల నుండి బంద్ ఉండడంతో స్థానికంగా దొంగ బంగారంపై చర్చ జరుగుతోంది.

కుటుంబాల సర్వే త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడుతున్న కుటుంబ సర్వేను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ తెలిపారు. గురువారం హైదరాబాద్ నుండి సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకులు వాకాటి కరుణ, కాంతి వెస్లీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంక్షేమ శాఖ జిల్లాల అధికారులతో కుటుంబ సర్వే కార్యక్రమ నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి అంగన్వాడీ కేంద్రం పరిధిలోని కుటుంబాల సర్వే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, పిల్లలు, బాలింతలు, వృద్ధులు, మహిళల సంఖ్యపై నివేదికను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడీలు కుటుంబ సర్వేలో చేపట్టే అంగన్వాడీల పరిధిలోని కుటుంబాల సమాచార సేకరణపై సిడిపిఓలు, సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేసి, అంగన్ వాడీలు పిల్లల పోషకాహార, ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షిస్తూ పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లలను తక్కువ, అతి తక్కువ ఎదుగుదల ఉన్న వారిని గుర్తించి వారిని మాములు స్థితికి తీసుకొచ్చే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని, సమయానుసారం పౌష్టిక ఆహారం, అవసరమైన మందులను అందించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల నుండి గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారం సరిగ్గా అందేలా చర్యలు చేపడతామని, గర్భం దాల్చిన మహిళలు తమ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో వివరాలు నమోదు చేసుకుని సమయానుసారంగా పరీక్షలు చేసుకునే విధంగా అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుడ్డు, బాలామృతం వంటివి అర్హత గల ప్రతి ఒక్కరికి చేరేలా చూస్తామని, పిల్లల్లో, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నియంత్రించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. పిల్లలు అంగన్వాడీలకు వచ్చేలా అంగన్వాడీలు టీచర్ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

గౌతమ బుద్ధుడు చూపిన ధ్యాన మార్గంలో నడుచుకోవాలి

నవతెలంగాణ-తలమడుగు

జ్ఞానప్రదాత గౌతమ బుద్ధుడు చూపిన ధ్యానమార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత తెలిపారు. గురువారం మండల కేంద్రంలో గల పులాజీ బాబా ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సాప్తహ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బహు జ్ఞాన ప్రధాత, అహింస మార్గదర్శకుడు గౌతమ బుద్ధుడు నేర్పిన ధ్యాన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని కోరారు. నేటి సమాజంలో శాస్త్ర సాంకేతికంగా ఎంత ఎదిగినా మనిషికి మానసిక ప్రశాంతత దొరకడం లేదన్నారు. అందుకు ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ధ్యాన మందిర కమిటీ అధ్యక్షులు కాటిపెల్లి సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అశోక్, సునీత, సాప్తహ నిర్వాకులు కాటిపల్లి రాధాబాయి, ఈశ్వర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఇంద్రమ్మ, అనిత, భోజమ్మ కేశవ్, పొచ్చన్న పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | మే 24, 2024 | www.navatelangana.com

సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తాం

నవతెలంగాణ-నిర్మల్

కాలనీలో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బర్కత్‌పుర కాలనీలోని డ్రైనేజీ, రోడ్డును పరిశీలించారు. కాలనీ అంతటా తిరుగుతూ సమస్యగా ఉన్న డ్రైనేజీ, రోడ్డు వ్యవస్థను పరిశీలించారు. డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త చెదరం వంటివి తొలగింపజేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులను



ఆదేశించారు. ఈ క్రమంలో మురుగు నీరు సాఫీగా ప్రవహించుటకు వీలుంటుందని అన్నారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నందున త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తాం అన్నారు. చైర్మెన్ వెంట స్థానిక కౌన్సిలర్ ముజాయిద్ చౌస్, కాలనీవాసులు ఉన్నారు.

ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలో ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని గురువారం డీఆర్డీఓ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం స్కూలు పిల్లల ఏకరూప దుస్తులు కుట్టడం సంఘ సభ్యులకు ఇవ్వడం చాలా ఆనందకరమని దీని ద్వారా మహిళలకు ఆదాయం పెరిగే అవకాశం ఉందని అన్నారు. సకాలంలో దుస్తులు కుట్టి స్కూల్ పిల్లలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్ర శేఖర్, ఏపీఓ, జగన్, ఏపీఎం అర్ల మల్లేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, సీసీలు మహేందర్, రాజశేఖర్, సుకుమార్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



అనుమతి ఉన్న విత్తనాలను విక్రయించాలి


తాంసి

నవతెలంగాణ-తాంసి

ప్రభుత్వ అనుమతి కలిగిన పత్తి విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని సీడ్స్ అండ్ పెస్టిసైడ్ దుకాణాల యజమానులకు మండల వ్యవసాయాధికారి రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీడ్స్ పెస్టిసైడ్ దుకాణాలను తహసీల్దార్ లక్ష్మి, ఎస్సై శివరాంలతో కలిసి దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ బిల్ బుక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విత్తన విక్రయ దుకాణదారుడు ఎట్టి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలను మందులను రైతులకు అమ్మవద్దని అన్నారు. ముఖ్యంగా పత్తి విత్తనాల కొరత సృష్టించి అమాయక రైతులకు అధిక ధరలతో పాటు నకిలీ పత్తి విత్తనాల అంటగట్టే ప్రమాదం ఉంటుంది. కొనుగోలు చేసిన పత్తి విత్తనాలకు ఒరిజినల్ బిల్లు రైతులకు ఇవ్వాలని అన్నారు. బిల్లులో లాట్ నెంబర్ రాయాలన్నారు. నకిలీ విత్తనాలు ఎరువులు పురుగుమందులు విక్రయించినట్లైతే విక్రయ దుకాణదారులపై కేసులు నమోదు చేయడంతో పాటు లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఉన్నారు.

ఉట్నూర్ : విత్తనాలు కొనుగోలుపై రైతులు జాగ్రతలు తీసుకోవాలని పులిమడుగు క్లస్టర్ ఏఈ ఓ జాడే దేవేందర్ అన్నారు. గురువారం ఏఓ రాథోడ్ గణేష్ ఆదేశాల మేరకు మండలంలోని ఎనిమిది క్లస్టర్ పరిధిలోని సాలెవాడ(బి), నాగాపూర్, కొలాంగూడ (హస్నా పూర్), ఎంక, కోపర్ ఘడ్, ఘోట్టి, కొలాంగూడ (బీర్సాయి పేట్) గ్రామాల్లో వానాకాలం సాగు సన్నద్ధం, కల్తీ విత్తనాలు, విత్తనాలు కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలను ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన విత్తన డీలర్ షాప్‌ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని, విత్తనాలు కొన్న రశీదులను పంట కాలం పూర్తి అయ్యే వరకు దాచుకోవాలని తెలిపారు. లూజు లేదా కల్తీ విత్తనాలు ఎవ్వరు కొనవద్దని, గ్రామంలో ఎవరైన కల్తీ విత్తనాలు అమ్మితే వ్యవసాయ శాఖ లేదా పోలీస్‌శాఖ వారికి సమాచారం ఇవ్వాలని, ఒకే రకం పత్తి విత్తనాలు కాకుండా అన్ని రకాల పత్తి విత్తనాలు వేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో హెల్ప్ లైన్ నెంబర్‌ని ఏర్పాటు వేయడం జరిగిందని, జిల్లా రైతులకి విత్తనాల కొనుగోలులో ఏదైనా సమస్యలు ఎదురైనా, విత్తనాల ఎంపికలో సలహాలు సూచనలకు మీ ప్రాంతంలో ఎవరైనా నకిలీ విత్తనాల విక్రయంతో సంబంధం కలిగిన వెంటనే హెల్ప్ లైన్ నెంబర్లు (8074812429, 9392779149)కు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : సీడ్స్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై నరేష్, ఏఓ ప్రమోద్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా దుకాణాల్లో ఉన్న ఎరువులను, విత్తనాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలనే అమ్మాలని, నాసిరకం విత్తనాలను అంటగట్టి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రైతులు కూడా విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి దుకాణాదారు నుంచి రశీదు తీసుకోవాలన్నారు. మండలంలోని రైతులు గుర్తింపు పొందిన విత్తన దుకాణాల్లో మాత్రమే కావాల్సిన విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. అదే విధంగా ఏ ప్రాంతంలోనైనా కచ్చితమైన కంపెనీ పేరు, బిల్లులు లేకుండా విడిగా విత్తనాలు విక్రయిస్తే వెంటనే మండల వ్యవసాయ అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్, సీడ్స్ దుకాణ యజమానులు పాల్గొన్నారు.


బజార్‌హత్నూర్

ఆదిలాబాద్‌టౌన్ : మార్కెట్‌లో ఆదివాసులను అమాయకులను చేసి నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్కెట్‌లో విత్తనాల కొరత తెస్తు బ్లాక్‌లో మహారాష్ట్రలో అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, విత్తనాల కొరత లేకుండా చూడాలని అధికారులను కోరారు. రశీదు ఇవ్వకుండా అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఉపాధిహామీ పనులను పరిశీలించిన ఎంపీపీ



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఘనపూర్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ పంద్రా జైవంత్‌రావు గురువారం పరిశీలించారు. ఉపాధిహామీ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పనుల వివరాలను సిబ్బంది నుంచి అడిగి తెలుసుకున్నారు. కూలీలు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని నిర్దేశిత సమయంలో పని పూర్తి చేసుకొని ఇంటికి చేరుకోవాలన్నారు.

ఘనంగా వైశాఖ బుద్ధ పూర్ణిమ జయంతి వేడుకలు



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంతో పాటు మండలంలోని దుప్పాపూర్ గ్రామంలో గురువారం వైశాఖ బుద్ధపౌర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుప్పాపూర్ గ్రామంలో దమ్మరత్ బుద్ధ విహార్‌లో సంప్రదాయబద్ధంగా తథాగత్ గౌతమ బుద్ధుని పూజలు నిర్వహించారు. అనంతరం బుద్ధ వందనం స్వీకరించారు. గత 30 సంవత్సరాల నుంచి గ్రామానికి చెందిన ధృత్‌రాజ్ లక్ష్మణ్ కుటుంబం తరపున ప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనక సేవంతా ప్రభాకర్, ధృత్‌రాజ్ రామ్‌కిషన్, అభీమాన్యు ధృత్‌రాజ్ విశ్వజిత్, ప్రశాంత్, ధమ్మానంద్, విద్వాన్, సురేష్, మధుకర్ ధృత్‌రాజ్, జ్ఞానోబా తిబోటే, అశోక్ వాగ్మారే గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగేర పెందూర్ వంశీయుల పెద్దదేవుడి ఊరేగింపు



నవతెలంగాణ-సిరికొండ

ఆదివాసుల నాగేర పెందూర్ వంశీయుల పెద్ద దేవుడి ఊరేగింపు పూజలను మండలంలోని కోసుపటేల్ గూడలోని ఆదివాసులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ కటోడ ఇంటి వద్ద నుంచి కొత్తగా పెండ్లయిన జంటలతో డోలు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి పెందూర్ వంశీయుల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర, తెలంగాణ నుంచి దాదాపుగా 300 కుటుంబాలు అక్కడికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కటోడలు పెందూర్ ఆనంద్‌రావ్, పెందూర్ జంగు, పెందూర్ బండు, గ్రామపటేల్ రావుజి, యాదవ్‌రావ్, కోసేరావ్, దేవరి జంగుబాపు పాల్గొన్నారు.

రైతులు నకిలీ విత్తనాల పట్ల జాగ్రతలు వహించాలి



నవతెలంగాణ-సిరికొండ

రైతులు నకిలీ విత్తనాల పట్ల జాగ్రతలు వహించాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, దీపక్‌లు అన్నారు. గురువారం మండలంలోని కోసుపటేల్ గూడ, లక్కంపూర్, పోచంపల్లి గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని అన్నారు. తొందర పడి విత్తనాలను ఇప్పుడే విత్తుకోవద్దని, అనుకూలమైన వర్షాలు కురిసిన తర్వాత విత్తుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నార్నూర్ : రైతులకు నకిలీ విత్తనాలు ఇచ్చి మోసగిస్తే ఫెర్టిలైజర్ షాప్‌పై చర్యలు తప్పవని ఏఈఓలు హెచ్చరించారు. గురువారం సోనాపూర్, మాన్యాపూర్, మహాగావ్, మాంగ్రి, కొత్తపెల్లి గ్రామాల్లో వాడాల్సిన వివిధ విత్తనాలపై రైతులతో అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామ పరిధిలోని ఉన్న ఫెర్టిలైజర్ షాప్‌ను పరిశీలించారు. షాప్‌లో ఉన్న పత్తి విత్తనాలు, ఎరువులు మందులను తనిఖీ చేశారు. విత్తనాలు ఎరువులు మందులు తీసుకునేటప్పుడు రైతులు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే వాడాలనీ నకిలీ విత్తనాలు తీసుకొని మోసపోవద్దన్నారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ కల్తీ విత్తనాలు అమ్మితే తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులకు, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అవగాహన కార్యక్రమంలో ఏఈఓలు సాయి కృష్ణ, రాథోడ్ రాజేశ్వర్, సైజాన్, నరేష్, నిఖిల్ ఉన్నారు.

జొన్నల కొనుగోళ్లు పరిశీలించిన మార్క్‌ఫెడ్ డీఎం



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో కొనుగోలు చేస్తున్న జొన్నల కేంద్రాన్ని గురువారం మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి తనిఖీ చేశారు. సొసైటీ సిబ్బందికి జొన్నల కొనుగోలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అక్కడ ఉన్న రైతులు డీఎంకు వారు పడుతున్న ఇబ్బందులను వివరించి, మార్కెట్ యార్డులో సౌకర్యాలతో పాటు షెడ్డు నిర్మాణం చేపట్టే విధంగా చూడాలని డీఎంను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ జొన్న పంటలను ఆరబెట్టిన తర్వాతనే మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. రైతుల పండించిన జొన్నలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, అకాల వర్షాల కారణంగా కొనుగోలులో కొంతమేర జాప్యం జరుగుతుందని అన్నారు. అధిక మైశ్చర్ కారణంగా గోదాంకు వచ్చిన తర్వాత కూడా రిటర్న్ వచ్చి అవకాశాలు ఉంటాయని అన్నారు. అందువల్ల నేచర్ లేకుండా చూసుకోవాలని సొసైటీ సిబ్బందికి సూచించారు. మార్కెట్ యార్డ్‌లో రైతులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మార్కెట్ యార్డులో షెడ్డు నిర్మాణం కొరకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ కేశవ్, సిబ్బంది సిద్ధార్థరెడ్డి, మోహన్‌రెడ్డి, హనుమాండ్లు, సుధాకర్, రైతులు ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి గురువారం పరిశీలించారు. వరి ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులతో పాటు అక్కడ పని చేస్తున్న కూలీలతో ముచ్చటించారు. కొనుగోలు కేంద్రాన్ని ధాన్యాన్ని తీసుకొస్తున్న రైతులకు టెంట్, నీళ్ల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట సీఈఓ మల్లయ్య, అధికారులు, రైతులు ఉన్నారు.

పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ గిరిజన సంక్షేమ పాఠశాలలో 2,530 బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలనీ గురువారం గిరిజన ఆదివాసీ విద్యార్థి సంఘ నాయకుడు జాదవ్ సుమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అయిన కూడా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలు భర్తీకి ఊసెత్తడం లేదని విమర్శించారు. ఆర్టీఏ ద్వారా సమాచారం తెలుసుకున్న మొత్తం పోస్టులు 2,530 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తేలడమైనది. ఇప్పటికైనా ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులకు న్యాయం చేసి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలనీ, లేనిపక్షంలో గిరిజన, ఆదివాసీ విద్యార్థులం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రకటించారు.

ఆన్‌లైన్‌లో ప్రశాంతంగా బీఎడ్ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఎడ్ కోర్సులో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్ రాతపరీక్ష ఆన్‌లైన్‌లో జరిగింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని నలంద కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్ష జరిగింది. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోగా క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోనికి అనుమతించారు. విద్యార్థులు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించారు. కాగా ఉదయం జరిగిన మొదటి సెషన్ పరీక్షకు 95 మంది హాజరు కావాల్సి ఉండగా 90 మంది హాజరై ఐదుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్ పరీక్షకు 95 మంది హాజరు కావాల్సి ఉండగా 87 మంది హాజరై 8 మంది గైర్హాజరయ్యారని సెంటర్ ఇన్‌చార్జి పున్నారావు తెలిపారు.

ప్రయివేట్ ట్రావెల్ బస్సు బోల్తా.. మహిళ మృతి

- 30 మందికి పైగా గాయాలు
- పలువురు సీరియస్.. హైదరాబాద్‌కు తరలింపు
- అతివేగమే ప్రమాదానికి కారణమని ఆరోపణ



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్, నిర్మల్

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ప్రయివేటు ట్రావెల్స్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. బస్సులో పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకుంటూ అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. తాజాగా ఈ ప్రయివేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ప్రయాణికులు, స్థానికుల వివరాల మేరకు.. బుధవారం రాత్రి ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు 50మందికి పైగా ప్రయాణికులతో ఓ ట్రావెల్ బస్సు రాత్రి 10.30 గంటల సమయంలో బయలుదేరింది. రాత్రి 12 గంటల ప్రాంతంలో నిర్మల్ జిల్లాలోని మహబూబ్‌ఘాట్స్ వద్ద బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న 25 మందికిపైకి తీవ్రగాయాలు కాగా, పలువురికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఫర్హాన బేగం(29) మహిళ పరిస్థితి విషమించమించడంతో మార్గమధ్యంలో మృతి చెందింది. మరొకరిని హైదరాబాద్‌కు తరలించారు. సమాచారం తెలుసుకుని అక్కడికి చేరుకున్న సారంగాపూర్ పెట్రోకార్, పోలీస్ సిబ్బంది, కానిస్టేబుల్ మనోజ్, రాణాపూర్ గ్రామస్తులు క్షతగాత్రులను 108 వాహనాల్లో నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదిలాబాద్ నుంచి బస్సు బయలుదేరినప్పటి నుంచే డ్రైవర్ బస్సును అజాగ్రత్తగా నడిపారని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు. అయితే ప్రయాణించిన బస్సులో టెట్ పరీక్ష కొరకు కొందరు, బీఎడ్ పరీక్ష కొరకు కొందరు, మరికొందరు ఇతర పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లగా ఈ ఘటన జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

నిర్లక్ష్యంగా నడపడంతోనే ప్రమాదం..

ఈ సందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు మాట్లాడుతూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలో మహబూబ్‌ఘాట్స్ వద్దకు రాగానే డ్రైవర్ అతివేగంగా నడపడంతో కంట్రోల్ తప్పి బోల్తా పడిందని తెలిపారు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న దాదాపు ప్రయాణికులందరికీ గాయాలయ్యాయని ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని కొందరికి కాళ్ల విరిగితే, కొందరికి చేతులు విరిగాయని, కొందరికి నడుము విరిగిందని, ప్రతి ప్రయాణికుడికి చిన్న పెద్ద గాయాలయ్యాయని తెలిపారు. వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్తున్నట్టు పేర్కొన్నారు.

అత్యవసరంలో వైద్యులు లేక అవస్థలు..

ఈ సందర్భంగా గాయపడ్డ ప్రయాణికులకు సేవలు అందించిన నిర్మల్ వాసి మాట్లాడుతూ ఆసుపత్రిలో ఒక డ్యూటీ డాక్టర్ తప్ప మరో వైద్యుడు లేరని సూపరింటెండెంట్‌కు ఫోన్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని పేర్కొన్నారు. ప్రయాణికులు చాలామంది తీవ్ర గాయాల పాలయ్యారని అన్నారు. జిల్లా మెడికల్ ఆసుపత్రి నిర్మల్‌లో ఉండి ఏం ప్రయోజనమని అత్యవసర వైద్య సేవలు అందించలేని ఆస్పత్రి ఎందుకని ప్రశ్నించారు.



బుద్ధుని మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలి



నవతెలంగాణ-భైంసా

ప్రపంచానికే కొత్త మార్గాన్ని చూపించిన తథాగత్ భగవాన్ గౌతమ బుద్ధుని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భైంసా అధ్యక్షులు ప్రసంజీత్ హేమ్లే అన్నారు. నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని పేండ్‌పల్లి గ్రామంలో గురువారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గొప్ప ఆధ్యాత్మిక గురువు గౌతమ బుద్ధుని 2568వ త్రిగుణ వైశాఖ బుద్ధ పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచశీల్ ధమ్మ ధ్వజ్ జెండా ఎగురవేసి, ముందుగా మహాత్మా గౌతమ బుద్ధుని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి అహింసాయుత మార్గం చూపిన గౌతమ బుద్ధుని బోధనలు అనుసరణీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ శాంతియుత జీవనం కోసం పంచశీల, నాలుగు ఆర్య సత్యాలు, అష్టాంగ మార్గము, పది పారమితాలు అనుసరించాలని సూచించారు. ప్రత్యక్ష అనుభవం ద్వారా గౌతమ బుద్ధుని బోధనలు అనుభవించడానికి శ్రామినేర్ దీక్ష ఉపయోగపడుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పేండ్‌పల్లి సభ్యులు బాకొల్ల మోహన్, బాకొల్ల రాజు, రాజారెడ్డి, పవన్, రాము, భోజన సాయిరెడ్డి, బిఎస్ఐ బౌద్ధాచార్యులు ప్రసంజీత్ హేమ్లే, మాజీ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ వీడీసీ సభ్యులు, బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు, మాజీ శ్రామినర్, బౌద్ధాచార్యులు, కేంద్రీయ శిక్షకులు, బౌద్ధ దమ్మ అభిమానులు, సమస్త బౌద్ధ, అంబేద్కర్ సంఘాల నాయకులు, మండల, పదాధికారులు పాల్గొన్నారు.

బోథ్ : మండలంలోని సొనాల గ్రామంలో గురువారం బుద్ధుని జయంతి సందర్భంగా అంబేద్కర్ సంఘం బౌద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బౌద్ధ విహార్‌లో పంచశీల జెండాను ఆవిష్కరణ చేసి బుద్ధుని విగ్రహానికి పూలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బౌద్ధ సొసైటీ మండల శాఖ అధ్యక్షులు అమృత్‌రావ్ మాట్లాడుతూ బుద్ధుడు చూపించిన జ్ఞానమార్గం మాధ్యమార్గం, అష్టంగా మార్గం ద్వారా ప్రజలు ఆయన మార్గంలోనే నడవాలని సూచించారు. అలాగే ఆయన మార్గాలు ప్రపంచానికే ఆదర్శమని అందుకే బౌద్ధమతం ప్రపంచంలో ఎన్నో దేశాల్లో విస్తరించిందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు భగత్ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి కే లక్ష్మణ్, నాయకులు బత్తుల రమేష్, మద్దేల మహేష్, సోమన్న, రాజారాం, రాహుల్, కిరణ్, స్వామి, గడప ప్రవీణ్ పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌పై దాడిచేసిన ఖలీంను అరెస్టు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాగజ్‌నగర్‌లో జర్నలిస్టు అంగల తిరుపతిపై దాడి చేసిన ఖలీంను వెంటనే అరెస్టు చేయాలని ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ సురేష్, కృష్ణంరాజు, కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.సురేందర్‌రావు, వి.తిరుమలచారి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎంత నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి కలెక్టరేట్ ఏఓ, ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టు తిరుపతిపై దాడి చేసిన ఖలీంను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్ చేస్తున్న స్థలాన్ని అధికారులు ఇప్పటి వరకు సందర్శించలేదని, వెంటనే అధికారులు అక్కడికి వెళ్లి మైనింగ్ అనుమతులున్నాయా లేవా అనే విషయంలో విచారణ చేపట్టాలన్నారు. పట్టా భూమి అయితే పట్టదారునికి నోటీసులు జారీ చేయాలన్నారు. అధికారులు స్పందించకుంటే జర్నలిస్టులు ఐక్యమై పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి

నవతెలంగాణ-రెబ్బెన



మండల కేంద్రంలో మరుగుదొడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు మరుగుదొడ్లు లేక కలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో కట్టిన మరుగుదొడ్లు ఇప్పటి వరకు ప్రారంభించలేదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి మరుగుదొడ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు చల్లూరి కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు చాపిడి శివ పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో జాప్యం లేకుండా చూడాలని, ఈ నెల 30లోగా కొనుగోలు చేయాలని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి ఆసిఫాబాద్ మండలం అప్పపెల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వసతుల గురించి తెలుసుకున్నారు. కొనుగోళ్ళలో ఏవైనా సమస్యలుంటే కొనుగోలు కేంద్రం దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలపై నిర్వాహకులను ఆరాతీశారు. ఈ నెల 30లోగా కొనుగోలు పూర్తి చేయాలన్నారు. తూకంలో మోసాలు లేకుండా చూడాలన్నారు. రైతుల వారీగా కొనుగోళ్ళు, సాగు విస్తీర్ణం, ధాన్యం వివరాలను నిర్వాహకులు ప్రతిరోజు ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటవెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వర్షాలు కురిసే అవకాశమున్నందున టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యం తేమశాతంపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింహరావు, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ వినోద్ కుమార్, జిల్లా కోఆపరేటివ్ అధికారి రబ్బానీ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

నవతెలంగాణ-వాంకిడి

విత్తనాల డీలర్లు అధిక ధరలకు రైతులకు విత్తనాలు, ఎరవులు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వానకాలం సమీపిస్తున్న నేపథ్యంలో విత్తనాలు కొనుగోళు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఒకే రకం విత్తనాలని ఎట్టి పరిస్థితులలోను కొనవద్దని, ఒక్కొక్క రకం పత్తి విత్తనం ఒకొక్క లక్షణంతో ఉంటుందని తెలిపారు. వర్షాలు ఎక్కువ కురిసినప్పుడే విత్తుకోవాలని సూచించారు. పత్తి పంట దిగుబడి వాతావరణ పరిస్థితులు, యాజమాన్య పద్ధతులపై ఎక్కువ శాతం ఆధారపడి ఉంటుందన్నారు. రకాలను బట్టి దిగుబడి ఉండదన్న విషయాన్ని రైతులు గమనించాలన్నారు. ప్రతి 10 ప్యాకెట్లు కొనగోలులో 3-4 రకాలను ఎంచుకోవాలని సూచించారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విత్తనాలు అమ్మితే వ్యవసాయశాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. విత్తనాలు కొన్న రైతులు తప్పని సరిగా రశీదు పొందాలన్నారు.

వంతెన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని అప్పపల్లి గ్రామానికి వెళ్లే కాలువపై వంతెన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. గురువారం అధికారులతో కలిసి వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు వేగంగా నాణ్యతతో కూడుకొని ఉండేలా చేయాలన్నారు. గత ఎన్నికల్లో గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు వంతెన మంజూరు కోసం కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకరి మంగ పెంటయ్య, మాజీ సర్పంచ్ బాపురావ్, నాయకులు గంగన్న పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు ఐదు ఈఎల్‌లు మంజూరు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పీఓ, ఏపీఓ, ఓపీఓ ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఐదు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా విద్యాధికారి అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయ సిబ్బందికి కనీసం ఐదు రోజుల ఆర్జిత సెలవులు మంజూరు చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలకు ఎస్జీటీ ఉపాధ్యాయులను ఇన్విజిలేషన్ కోసం ఉపయోగించుకునేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. వేసవి సెలవుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన సిబ్బందికి 24 రోజులు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగంటి భిక్షపతి, నాయకులు పత్తిపాక శ్రావణ్ కుమార్, కొయ్యడ శ్రీనివాస్, ఉప్రే వినేష్, పి.సాంబశివరావు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లాలో 8 సెంటర్లు, 2989 మంది విద్యార్థులు
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు



తరగతి గదుల్లో నంబర్లు వేస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శుక్రవారం నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే పరీక్షా కేంద్రం సమీపంలోని పోలీస్ స్టేషన్‌లకు ప్రశ్న పత్రాలు సరఫరా కాగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొన్నిచోట్ల అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం, ద్వితీయ సంవత్సరం పరీక్ష మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుండగా ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో కేంద్రాల్లో తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు ఏఎన్ఎంను అందుబాటులో ఉంచుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

జిల్లాలో ఈనెల 24 నుండి వచ్చే నెల 1వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 8 సెంటర్లు ఏర్పాటు చేయగా ఈ 8 సెంటర్‌ల నిర్వహణ కోసం ప్రతి సెంటర్‌కు ఒక చీఫ్ సూపరిండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను నియమించారు. ప్రశ్నపత్రాల నిర్వహణ కోసం కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ కేంద్రాలలో కస్టోడియన్‌లను ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బందితో పాటు సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు.

జిల్లాలో 8 సెంటర్లు 2989 మంది విద్యార్థులు

జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల కోసం మొత్తం 2989 మంది హాజరు కానుండగా, వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 1938 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1051 మంది ఉన్నారు. వీరి కోసం మొత్తం 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 6 ప్రభుత్వ జూనియర్ కళాశాలు, ఒకటి ప్రయివేట్, ఒకటి ఆదర్శ పాఠశాలలో 1 కేంద్రాలున్నాయి. గత సంవత్సరంతో పోల్చితే ప్రస్తుత సంవత్సరం రెండు సెంటర్లను అదనంగా పెంచారు.

ఒక్క నిమిషం నిబంధన వర్తించదు

పోటి పరీక్షలు మాదిరిగానే ఇంటర్మీడియట్ పరీక్షలకు కూడా గతంలో ఒక్క నిమిషం నిబంధన వర్తించగా ప్రస్తుతం దానిని తొలగిస్తూ ఐదు నిమిషాలు అనుమతి ఇవ్వనున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష సమయానికంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 8 గంటల నుండి పరీక్ష కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతించనున్నట్లు వివరించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

కొన్ని పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేయగా వాటిలో విద్యార్థులకు ఇబ్బందులు కాకుండా మౌలిక వసతులు కల్పన కోసం ప్రథమ ప్రాధాన్యత ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తాగునీటి వసతితో పాటు మూత్రశాలలు ఇతర ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటిస్తు విద్యార్థులు కేంద్రాలకు రావాలని సూచించారు.

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

నైతం శంకర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి



జిల్లాలో 8 సెంటర్లు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేశాం. ఇప్పటికే ఆయా సెంటర్‌లలో అధికారులతో సమావేశం నిర్వహించడంతో పాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. మాస్ కాఫీయింగ్ జరగకుండా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు సరైన సమయానికి పరీక్ష కేంద్రానికి చేరే విధంగా బస్సులు ఉండేలా చూస్తున్నాం. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి.

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు



కాగజ్‌నగర్‌లో పూజలు నిర్వహిస్తున్న బుద్దిస్ట్ సొసైటీ సభ్యులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గౌతమబుద్ధుని 2,568వ జయంతి వేడుకలను గురువారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక మీరాతాయి దీక్ష భూమిలో ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాలంకరణ చేశారు. అనంతరం పంచశీల జెండాను ఆవిష్కరించారు. బౌద్ధ అనుయాయులచే బుద్ధ వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు దుర్గం జనార్దన్ మాట్లాడుతూ ఇంద్రియ సుఖాలను త్యజించిన వారు గొప్పవారవుతారని గౌతమ బుద్దుడు చెప్పాడన్నారు. శాంతి, సమానత్వం, సౌభ్రాతృత్వం బోధించిన బౌద్ధం అందరికీ అనుసరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో సమత సొసైటీ ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి, కోశాధికారి డొంగ్రి గజానన్, బుద్దిస్ట్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం విస్తారు, నాయకులు విశ్వాస్ జగతాప్, రమేష్ డొంగ్రి, పండరీనాథ్ తాడె, మోహన్ దుర్గం, దుర్గం రాంచందర్, శ్రీనివాస్ జాడి, రవి కొబ్రాగడ, ప్రదీప్ జిమ్మిడి, దుర్గం చరణ్‌దాస్, మేడి చరణ్‌దాస్, డాక్టర్ టేమాజీ, సుఖదేవ్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : బుద్ధుని బోధనలు ఆచరణీయమని ఆసిఫాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్ అన్నారు. బుద్ధ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుడు చేసిన సేవలను, త్యాగాలను కొనియాడారు. ప్రపంచ మానవాళికి శాంతి, సమానత్వం బోధించిన బుద్ధుడు అందరికీ అనుసరణీయమని గుర్తు చేశారు. కార్యక్రమంలో తుకారామ్, సుధాకర్, మారుతీ, హెూక్టు, శంకర్ పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలో జశ్వంత్ బుద్ధ విహార్‌లో బుద్ధ పూర్ణిమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచశీల జెండాను ఆవిష్కరించి బుద్ధ వందన సమర్పించారు. అనంతరం మండల కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా మండలంలోని కామన, ఇందని, బెండరా, కానర్‌గావ్, దొడ్డిగూడ తదితర గ్రామాల్లో కూడా బుద్ధ పూర్ణిమ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు జయరాం, విజయ్, పాండు, రమాబాయి అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వాంకిడిలో పూజలు చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలి

- జిల్లా క్రీడల అధికారిణి రమాదేవి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిణి రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన నెట్ బాల్ పురుషులు, మహిళల సీనియర్స్ ఎంపికకు జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, జిల్లా కార్యదర్శి కోచ్ బి.తిరుపతితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 46 మంది స్త్రీలు, 36 మంది పురుషులు హాజరుకాగా రెండు విభాగాల నుండి 12 మంది చొప్పున వివిధ పరీక్షల ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జిల్లాలో క్రీడారంగా అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో క్రీడ నైపుణ్యాన్ని వెలికి తీసే ఉద్దేశంతో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంచాలన్నారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు హరీష్, ప్రభాకర్, రాకేష్, గురువేందర్, యోగి, కిరణ్, ప్రసాద్, తిరుపతి పాల్గొన్నారు.

విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూస్తాం

- ఎస్ఈ వాసుదేవ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యుత్ ఇబ్బందులు లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్ తెలిపారు. మెడికల్ కళాశాలకు సంబంధించిన సర్వీస్ కనెక్షన్‌తో పాటు కళాశాల జనరేటర్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యుత్ సమస్య లేకుండా నిరంతర పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగార్జున చారి, విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్, ఆసిఫాబాద్ ఏఈ సదాశివ పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షా కేంద్రంలో పటిష్టమైన భద్రత

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జూన్ 9న జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్-1 పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావుతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేయగా 2,783 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని చెప్పారు. పరీక్ష రాయనున్న వారికి ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవడం వంటి మౌలిక వసతులను కల్పించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాట్లు ఉండేలా చూస్తామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రానికి మూడు కిలో మీటర్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష నిర్వహణ జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో నియమించబడిన ఇన్విజిలేటర్లకు విషయ పరిజ్ఞానం ఉండాలని, పరీక్షా సమయం ప్రకారంగా గంట మోగించడం ద్వారా అభ్యర్థులకు సమయాన్ని తెలియజేయాలని చెప్పారు. అభ్యర్థులు ఒక గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉంటుందని, 9.30 గంటలకు బయోమెట్రిక్ చెకింగ్‌తో పాటు 10 గంటల వరకు ప్రవేశానికి అనుమతి ఉంటుందని, 10 దాటిన తరువాత అనుమతించబోమని తెలిపారు. సెల్‌ఫోన్‌తో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరుగదని పేర్కొన్నారు. సమయానుసారంగా రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో బస్సులు నడపడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ రీజినల్ కో ఆర్డినేటర్ నర్సింహం, కళాశాల ప్రిన్సిపల్, స్థానిక సీఐ సతీష్ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

అందుబాటులో జీలుగ విత్తనాలు

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని సహకార సంఘం కేంద్రంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సహకార సంఘం సీఈఓ రాజేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీలుగ విత్తనాలు పోలంలో వేసుకొని వరి నాట్లు వేసే రోజుకు మూడు రోజుల పొలం దున్ని మురుగ పెట్టుతే భూ సారం పెరిగి పంట దిగుబడి అధికంగా వస్తుందన్నారు. రైతులు పట్టపాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను ఇచ్చి కొనుగోలు చేసుకోవాలని సూచించారు. 30 కిలోల బస్తా ధర రూ.1116 ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కామన గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం లైన్‌గూడకు చెందిన సీడాం భీంరావ్, తన తల్లి రుకుంబాయి(40) బైక్‌పై ఉదయం మండలంలోని బండకాస గ్రామంలో ఆలయంలో పూజలు చేసేందుకు బయల్దేరారు. సాయంత్రం పూజల అనంతరం తిరుగు ప్రయాణంలో కామన వద్ద వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను రాంగ్‌రూట్‌లో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనానికి ఢీ కొట్టారు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న సీడాం రుకుంబాయికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయలకు గురైన రుకుంబాయిని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కౌటాల

మరమ్మత్తుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవిందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33 కే వి లైన్ మరమత్తులు పెద్ద బండ నుంచి లోనవెల్లి ఫ్రీడర్ మరమత్తులు ఉన్నందున కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాలకు ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండన్నారు. వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | మే 24, 2024 | www.navatelangana.com

పుష్కరిణిని ప్రారంభించిన జీఎం మనోహర్

నవతెలంగాణ-మందమర్రి



వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొత్తగా నిర్మించిన పుష్కరిణిని ఏరియా జీఎం మనోహర్ ప్రారంభించారు. వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఏరియా జీఎం మనోహర్ సవిత దంపతుల ఆధ్వర్యంలో 5వ రోజు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానంలో కొత్తగా నిర్మించినటువంటి పుష్కరిణిని ప్రారంభించి అనంతరం స్థానిక భక్తులతో కలిసి చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఈ అండ్ ఎం నాగరాజు, డీజీఎం సివిల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుల్లకోట జీపీని సందర్శించిన కేంద్ర బృందం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని గుళ్ళకోట గ్రామ పంచాయతీని గురువారం కేంద్ర బృందం సందర్శించింది. పలువురు అధికార్లు గ్రామాల్లో పర్యటించి క్రిమీటోరియమ్, సెగ్రీ యేషన్ షేడ్, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, రహదార్లు, మురికి కాలువ లను, సబ్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలను ఈజీఎస్ పనులను పరిశీలించడం జరిగింది. అట్టి పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. ప్రభుత్వ పథకాలు సక్రమముగా అందుతున్నాయా లేవా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ. విజయ్ ప్రసాద్ ఉన్నారు.

ముంపు ముప్పు తప్పేనా..?

- గోదావరి తీర ప్రాంతంలో పంటల సాగు ప్రశ్నార్థం
- 33 గుర్తించిది ఎకరాలు.. మునుగుతున్నది వంద ఎకరాలు
- వరద నివారణ చర్యలు చేపట్టాలి : బాధిత రైతులు

నవతెలంగాణ-జైపూర్

గోదావరి వరద ముప్పు మరో మారు ముందుకొస్తుంది. వర్షాకాలం సమీపిస్తున్న తీర ప్రాంత రైతుల్లో ఆందోళన మొదలైంది. గత ఐదు సంవత్సరాల నుంచి వెంటాడుతున్న గోదావరి వరద వందల ఎకరాలను ముంచెత్తుతోంది. కిష్టాపూర్ నుంచి శివ్వారం వరకు గల వేలాల, పౌనూర్ శివారు వ్యవసాయ భూములకు ప్రతి సంవత్సరం వరద ముంపు తప్పడం లేదు. ఫలితంగా మండల పరిధి గోదావరి తీర ప్రాంతంలో పంటల సాగు ప్రశ్నార్థంగా మారింది. శివ్వారం శివారులో ముంపు ముప్పు 33 ఎకరాలుగా గుర్తించినా వందల ఎకరాల్లోకి గోదావరి వరద వచ్చి చేరుతోంది. ప్రతి ఏటా వరద ఇబ్బందులతో పంటలు సాగు చేయడం సమస్యగా మారిందని బాధిత రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. వరద నివారణ చర్యలు చేపట్టాలని అభ్యర్థిస్తున్నారు.



వేలాల శివారు వరిపొలంలో వచ్చి చేరిన వరద (ఫైల)



కోతకు గురైన పంట చేను (ఫైల్)

ఒక వైపు అన్నారం బ్యారేజ్.. మరో వైపు సుందిళ్ల బ్యారేజ్

కిష్టాపూర్-శివ్వారం మధ్య గోదావరి తీర ప్రాంతంలో పంటల సాగు సమస్యగా మారింది. వరి, పత్తి, మిర్చి ప్రధాన పంటలుగా సాగు చేస్తున్న రైతులు గత ఐదు సంవత్సరాల నుంచి గోదావరి వరద ముప్పును ఎదుర్కొంటున్నారు. సాగు చేసిన పంటలను నష్టపోవడంతో పాటు పంట పొలాలు కోతకు గురి అవుతున్నాయి. అన్నారం బ్యారేజ్ నిల్వ నీరు సుందిళ్ల బ్యారేజ్ మిగులు నీరు పంట పొలాల మీదుగా ప్రవహిస్తుడటం పంటల సాగుపై ప్రభావం చూపిస్తోంది. అన్నారం బ్యారేజ్ నిల్వ నీటితో శివ్వారం శివారులో 33 ఎకరాల ముంపుకు గురవుతున్నట్లు గుర్తించగా అదనంగా లోతట్టు ప్రాంతంలో గల 78 ఎకరాల భూమి ముంపుకు గురవుతున్నట్లు బాధిత రైతులు పేర్కొంటున్నారు. ముంపుకు గురవుతున్నట్లు గుర్తించిన భూములకు కూడా ఇప్పటి వరకు పరిహారం పంపిణీ చేయలేదు. ఆ బ్యారేజ్‌ల నుంచి నీటిని వదిలిన వెంటనే కిష్టాపూర్, వేలాల, పౌనూర్, శివ్వారం శివారు గోదావరి తీర ప్రాంతంలో వరద నీరు వచ్చి చేరుతోంది. గత సంవత్సరం కురిసిన వర్షాలతో వేలాల, శివ్వారం గ్రామాల్లోకి గోదావరి వరద వచ్చి చేరడంతో ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది. అదేవిధంగా పంట పొలాల్లో నిల్వ చేసుకున్న రసాయన ఎరువు బస్తాలు, విద్యుత్ మోటర్లు, వ్యవసాయ ఉపకరణాలు, ట్రాక్టర్లు నీటిలో మునిగి పోయాయి.





కోతకు గురైన పంట చేను (ఫైల్)

కార్యరూపం దాల్చని కరకట్ట హామీ

గోదావరి వరదలతో తీర ప్రాంతానికి జరుగుతున్న నష్టాన్ని గత ఏడాది తిరిగి చూసిన స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కరకట్ట కట్టి వరద నివారణ చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. అదే క్రమంలో తీర ప్రాంత రైతుల ఇబ్బందులు సంబంధిత వ్యవసాయ శాఖ మంత్రితో పాటు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాళేశ్వరం బ్యారేజ్ సందర్శించేందుకు వచ్చిన సీఎంతో పాటు మంత్రులకు స్థానిక రైతుల ఇబ్బందులు, నివారణకు తీసుకోవల్సిన చర్యలు వివరించిన ఆయన ముంపు ప్రాంతంలో కరకట్ట కట్టిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు హామీ కార్యరూపం దాల్చకపోవడంతో ఈ ఏడాది కూడ తీర ప్రాంతానికి వరద ముప్పును ఎదుర్కొవల్సి వస్తుందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

నీటిని కిందకు వదలాలి : రేండ్ల రమేష్ (రైతు)



గోదావరి నది ఒడ్డు వరకు మాత్రమే నీటిని నిల్వ చేసి వచ్చిన నీళ్ల వచ్చినట్లు కిందికి వదిలితే వరద ఇబ్బందులు ఉండవు. గతంలో భారీ వర్షాలు ఎడతెరిపి లేకుండా కురిసిన సందర్భాల్లో గోదావరి ఒడ్డు వరకు వరద వచ్చేది. మరీ ఎక్కువ అనుకుంటే సమీప పంట పొలాల్లోకి వచ్చినట్టే వచ్చి వెళ్లిపోయేది. పంటల సాగుకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. అన్నారం బ్యారేజీలో నీళ్ల నిల్వ చేసి సుందిళ్ల బ్యారేజీ వరద వదులు తుంటంతో గోదావరి వరద పంట పొలాల్లోకి వచ్చి చేరుతోంది.

తీవ్రంగా నష్టపోతున్నాం : పేద్దపల్లి శ్రీనివాస్, రైతు, శివ్వారం.



బ్యారేజీలతో లాభపడేది ఎవరోగాని మేము మాత్రం తీవ్రంగా నష్టపోతున్నాం. ఐదేండ్ల నుంచి వరద ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వరద ముంపుకు గురవుతుందని తెల్సి కూడా సాగు చేయలేక ఉండలేని పరిస్థితి మాది. తాత ముత్తాతల నుంచి వ్యవసాయాన్ని నమ్ముకున్నాము. వ్యవసాయం తప్పా మరో పని లేదు. కంటి తుడుపుగా వచ్చి పోవడమే తప్పా పాలకులైనా ప్రభుత్వ అధికారులైనా మా ఇబ్బందుల పట్ల స్పందించడం లేదు.

ఘనంగా దేవాపూర్‌లో బుద్ధ జయంతి



నవతెలంగాణ-కాసిపేట

మండలం దేవాపూర్ అంబేద్కర్ భవన్‌లో బుద్ధుడి 2566 వైశాఖ బుద్ధ జయంతి ఉత్సవం అంబేద్కర్ యువజన సంఘం, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజా సంఘాల నాయకులు బుద్ధుడి విగ్రహం ముందు పూలు సమర్పించారు. బుద్దిస్ట్ సొసైటీ మహిళా అధ్యక్షురాలు రజనీ పాలేకర్ ఆధ్వర్యంలో బుద్ధ వందనం చేశారు. ఈ సందర్భంగా బీఎస్ఐ మండల ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు మాట్లాడుతూ బుద్ధుడి బోధనలు పంచశీల, అష్టాంగ మార్గాలు పాటించడం వల్ల ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవిస్తారని అన్నారు. సామాజిక చైతన్య వేదిక ప్రధాన సలహాదారులు చిన్న భీమయ్య మాట్లాడుతూ బుద్ధుడు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని నిత్యజీవితంలో అందరం బుద్ధుడి బోధనలు పాటించాలి అన్నారు. బుద్ధుడి జీవిత విశేషాలు, సమాజానికి ఇచ్చిన ప్రబోధాల గురించి అంబేద్కర్ యువజన సంఘం దేవపూర్ అధ్యక్షుడు గసికంటి మల్లేష్, సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య, అంబేద్కర్ యువజన సంఘం మండల కార్యదర్శి రామిళ్ళ కిష్టయ్య, ఎం 21 బెల్లంపల్లి మండల ఇన్‌చార్జి కనకయ్య, గోడిసెల స్వామి, సాయి కిరణ్, ఆత్రం మహేష్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ సభ్యులు ముల్కల రాములు, మహేష్, బెల్లంపల్లి ఎం 21 సభ్యులు కృష్ణ, రాజన్న ఉమా, విజయ పాల్గొన్నారు.

కవ్వాల్‌లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణంగా మరణించిన అంజత్ ఖాన్ జ్ఞాపకార్థం స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు అక్రంఖాన్, మండల కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీఖాన్‌లు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడలపై మక్కువ చూపాలన్నారు. ఈ టోర్నమెంట్ మొదటి బహుమతి రూ.10,116 రెండవ బహుమతి రూ.5016 ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నరు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సక్రు నాయక్, టీజీ డబ్ల్యు డబ్ల్యు సి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతి, మండల కాంగ్రెస్ యువజన నాయకులు శాభీర్ అలీ, గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపకులు పరకాల మహేష్, అలీ ఖాన్, మహేష్, అంజి, పోడేటి రవి పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో సెక్యూరిటీ విభాగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు అన్నారు. గురువారం సమస్యలపై సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆఫీస్ వద్ద సిబ్బందికి పనులను అప్పగించే సమయంలో గాని రిటైర్మెంట్ అయిన కార్మికులను సన్మానించుటకు ఒక రెస్ట్ హాల్ ఏర్పాటు చేయాలని, డ్యూటీ పోస్టుల వద్ద మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలని అన్నారు. ఎస్ఆర్పీ-1 గేట్ పోస్టు రెండు మైన్స్ రికార్డు చేస్తున్నారని, అక్కడ పని ఎక్కువగా ఉన్నందున అనుకూలమైన రూమ్ లేకపోవడంతో అక్కడ వారు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. గార్డుకు ఇంకొక గార్డును ఇచ్చి రూమును విస్తరింప చేయాలని డిమాండ్ చేశారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ఎస్ఆర్పీ ఓసీలో పనిచేస్తున్న జీవీఆర్ బంక్, సీఆర్ఆర్ బంక్, డీజిల్ బంక్‌ల వద్ద ఉన్న గార్డ్ రూమ్‌లను నూతనంగా ఆధునికరించాలని అన్నారు. అనంతరం నూతన ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. ఫిట్ సెక్రటరీగా ఎండీ గులాం మోయినుద్దీన్, అసిస్టెంట్ సెక్రటరీ పొలం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు చక్రధర్, ప్రధాన కార్యదర్శులు పూదరి సాంబయ్య, సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు ఎం ఆంజనేయులు, విజయ్ కుమార్, షిఫ్ట్ కార్యదర్శి ఏ రిలే రవీందర్, బీ రిలే రవి, సీ రిలే రాంగోపాల్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

పత్తి మార్కెట్‌లలో దోపిడిని అరికట్టాలి

- క్వింటాలుకు రూ.12 వేలు చెల్లించాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

నవతెలంగాణ-తాండూర్

పత్తి మార్కెట్‌లలో దోపిడిని అరికట్టి, క్వింటల్‌కు రూ.12 వేలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్ డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సంకె రవి అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటి సమావేశంలో శోభన్ మాట్లాడారు. మార్కెట్లలో పత్తి ధరలు క్వింటాలుకు రూ.6650 తగ్గించి మధ్య దళారులు విపరీతంగా లాభాలు సంపాదిస్తున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పత్తికి కనీస మద్దతు ధర రూ.7020 తెలంగాణలో వ్యాపారులు మిలాఖత్ అయి పత్తి ధరను తగ్గించారని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పేరు చెప్పి రైతులను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అధిక వర్షాలతో రాష్ట్రంలో 6 లక్షల ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా దెబ్బ తిన్నదని, ఎకరాకు 2-5 క్వింటాళ్ల లోపు మాత్రమే పంటదిగుబడి వచ్చిందని తెలిపారు. ఎకరానికి 60 వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతుకు రూ.30 వేలకు మించి ఆదాయం రావడం లేదని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లో ఒక క్యాండీ దూది రూ.90 వేలు ఉండగా దూది ఒక కిలో రూ.265 మార్కెట్లో కొనుగోలు జరుగుతుందనితెలిపారు. రాష్ట్రంలో మాత్రం కిలో దూది రూ.120ు మించి అమ్మకాలు సాగడం లేదన్నారు. ప్రభుత్వాలు అత్యధిక లాభాలు అర్జించే మధ్య దళారుల దోపిడిని అరికట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.12000 వచ్చే విధంగా ధర నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఆదాయం వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు, పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి నాయకులు సింగటి రవి, ఇందురి తిరుపతి, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దుర్గం భూమయ్య, దుర్గం బాపురాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మూడ్ శోభన్

ఎన్నికల్లో విధులు నిర్వహించిన కార్మికులను ఆన్ డ్యూటీగా పరిగణించాలి



నవతెలంగాణ-నస్పూర్

పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన సింగరేణి కార్మికులను ఆన్ డ్యూటీ గా పరిగణించి, టీఏ, డీఏలకు అవకాశం కల్పించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు డిమాండ్ చేశారు. గురువారం డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సత్తయ్య మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉన్నప్పటికీ పారిశ్రామిక వివాదాల చట్టం అమలులో ఉండగా బొగ్గు పరిశ్రమలో చేస్తున్న కార్మికులకు కొన్ని రాష్ట్రాలలో పరిగణించిన తెలంగాణ రాష్ట్రం సింగరేణి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ఆన్ డ్యూటీగా ప్రకటించకపోవడం మూలంగా సంవత్సర హాజరులలో నష్టం, దీపావళి బోనస్ లాభాల వాటా అంశాలలో కూడా ఆర్థికంగా నష్టం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని తక్షణమే ఎన్నికలలో విధులు నిర్వహించిన కార్మికులకు ఆన్ డ్యూటీగా ప్రకటించి టీఏ, డీఏ అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకొని సర్క్యులర్ జారీ చేయాలని పేర్కొన్నారు.

మరణానంతరం శరీర దానం చేయుటకు ముందుకు వచ్చిన దంపతులు



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అంజలి దంపతుల గురువారం పెళ్లిరోజు సందర్భంగా బ్రతికున్నప్పుడే కాదు మరణించిన తర్వాత కూడా సమాజానికి ఉపయోగపడాలని శరీర దానం చేస్తున్నట్లు సోపతి వెల్ఫేర్ సొసైటీ సంస్థకు అంగీకార పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకురాలు మల్లు స్వరాజ్యం మరణానంతరం తన శరీరాన్ని వైద్య పరిశోదనలకు ఇచ్చారని తెలిపారు. వారి స్ఫూర్తితోనే తాము శరీర దానం చెయ్యాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సోపతి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ భీంపుత్ర శ్రీనివాస్, సీపీఐ(ఎం) సంకె రవి మాట్లాడుతూ శరీరం, రక్తదానం చెయ్యాలంటే మనుషుల్లో ఉన్న భయం, మూఢత్వం మూలంగా చెయ్యలేక పోతున్నారు. దీనివలన సమాజానికి ఉపయోగపడే కొత్త కొత్త ఆవిష్కరణలు జరగలేక పోతున్నాయన్నారు. శ్రీనివాస్ అంజలి దంపతులు చైతన్యంతో ముందుకు వచ్చి శరీర దానం చెయ్యడాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని భవిష్యత్తు తరానికి ఉపయోగపడే విధంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకురాలు రాజకుమారి, శ్రీనిత, లక్ష్మి, సుశాంతి పాల్గొన్నారు.

వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వం వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దాగాం రాజారాం కోరారు, గురువారం మండలంలోని గోపాల్ నగర్ గ్రామం రైతుల వరి కల్లాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్ల కొనుగోలు త్వరగా చేపట్టకపోవడంతో నెల రోజులుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అకాల వర్షాలకు పంటను అమ్మ లేక తీవ్ర ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ఒకవైపు ఖరీఫ్ సాగు సమీపిస్తున్న తరుణంలో పెట్టుబడి చేతిలో లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో పిల్లల ఫీజులకు చేతిలో డబ్బులు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అకాల వర్షాలకు పంట అమ్ముడుపోకపోవడంతో ధాన్యపు రాశుల వద్ద నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వడ్ల కొనుగోలను వేగవంతం చేయకుంటే రైతులను చైతన్యపరిచి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్, దుర్గం నాన్నయ్య, బొల్లం రాజేశం నాయకులు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రాగి జావ పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి పంచాయతీలోని గుండ్లపొడ్, దుబ్బగూడెం గ్రామంలో గురువారం ఉపాధి హామీ కూలీలకు ఆదివాసీ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్ ఆధ్వర్యంలో రాగి జావ పంపిణీ చేశారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ఎండల నుంచి ఉపశమనం కోసం తన వంతుగా ఉపాధి కూలీలకు పంపిణీ చేసినట్లు పెంద్రం శంకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



పెండింగ్ బిల్లులు చెల్లించండి

నవతెలంగాణ-జైపూర్

ఆదర్శ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మండల పరిధి వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు ఒక ప్రకటనలో కోరారు. ఈ విషయమై గతంలో మంత్రి సీతక్కతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి వినతి పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. సర్పంచ్ ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రభుత్వ పెద్దలు గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించిన పనుల సంబంధిత బిల్లులు చెల్లించేందుకు ముందుగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని లింగి వృద్ధాశ్రమంలో గురువారం అజయ్ ఐశ్వర్య దంపతుల కుమార్తె చీత పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. అదేవిధంగా బుద్ధ జయంతి పురస్కరించుకొని వృద్ధాశ్రమంలో అన్నదానం వస్త్ర దానం నిర్వహించారు. అనంతరం వృద్ధుల మధ్య చీత కేక్ కట్ చేశారు. అనంతరం జైనథ్ మండల బీఆర్ఎస్ నాయకులు బద్రే సుభాష్ తన మనుమరాలైన చీత చేతుల మీదుగా బట్టలు వృద్ధులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు చీతను దీవిస్తూ ఆయురారోగ్యం సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హెడవ్ అశోక్, చందన్కర్ విపుల్, తెలంగ్ అజయ్ కుమార్, మాడవి అశోక్, శేశరావ్, రవి, కళావతి, ఐశ్వర్య ఆకాంక్ష వృద్ధులు పాల్గొన్నారు.

దారిదోపిడీ చేసిన ఇద్దరు దొంగల అరెస్టు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని మహబూబ్ ఘాట్ వద్ద బుధవారం రాత్రి దారి దోపిడీకి పాల్పడ్డ ఇద్దరి దొంగలను అరెస్టు చేసినట్టు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పెర్కిట్ గ్రామానికి చెందిన మొహమ్మద్ అంశార్, మహమ్మద్ ఒవేస్‌లు తమ ఆటోలో జెనరేటర్‌ను రిపేర్ చేయించడానికి పెర్కిట్ నుంచి ఇచ్చోడ వెళ్తున్న క్రమంలో మహబూబ్‌ఘాట్ వద్ద ఆర్కల రంజిత్ మాటేగం ఆర్కల రజిత్, పెంపల్లి గ్రామానికి చెందిన జల్ల లక్ష్మన్‌లు విచక్షణ రహింతగా రాళ్లు, కట్టెలతో దాడిచేసి వారి వద్దనున్న రూపాయలను లాక్కున్నారు. ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం నిర్మల్ పట్టణంలో అనుమానంగా తిరుగుతూ కనిపిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని విచరించారు. దీంతో వారు మహబూబ్‌ఘాట్ వద్ద దారి దోపిడీ చేసినట్టు నేరాన్ని అంగీకరించారు. వారిపై కేసు నమోదు చేసి దొంగలను కోర్టుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు. దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రైలు పట్టాలపై విరిగిపడిన చెట్లు

- నాలుగు గంటల పాటు నిలిచిన కృష్ణా ఎక్స్‌ప్రెస్



నవతెలంగాణ- తలమడుగు

రెండు రోజుల క్రితం ఈదురుగాలులు సృష్టించిన భీభత్సానికి తీవ్ర నష్టం జరిగింది. పలు ఇండ్లు కూలిపోగా..విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. బుధవారం సాయంత్రం వీచిన గాలులకు మండలంలోని కప్పర్‌దేవీ గ్రామ సమీపంలో రైలు పట్టాలపై భారీ వృక్షం విరిగిపడింది. దీంతో రాత్రి 9గంటలకు ఆదిలాబాద్ నుంచి బయలుదేరాల్సిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగు గంటల పాటు స్టేషన్‌లోనే నిలిచిపోయింది. అదే రాత్రి రైల్వే విద్యుత్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని భారీ వృక్షాలను యంత్రాలతో తొలగించి మార్గాన్ని సుగుమం చేశారు. దీంతో రాత్రి 1.30గంటల ప్రాంతంలో కృష్ణా ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. రైలు ప్రయాణానికి అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

గ్రామస్తుల రాకపోకలకు కష్టం

నవతెలంగాణ-బేల

మండలంలోని కోగ్దూర్ గ్రామానికి వెళ్లడానికి ప్రధాన రోడ్డు ఇది. బుధవారం రాత్రి కురిసిన చిన్న పాటి వర్షానికే రోడ్డు పైనా ఇలా నీరు నిలిచి వాగులా మారింది. ప్రధాన రోడ్డు కావడంతో జనాలంతా అదే దారి గుండా పోతుంటారు. ఇలా రోడ్డు పైనా నీరు నిలవడంతో రోడ్డు దాటడంతో గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అకాల వర్షంతో నష్టపోయిన కుటుంబాలను ఆదుకుంటాం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ



నవతెలంగాణ-తలమడుగు

ఆకాల వర్షంతో నష్టపోయిన కుటుంబాలను ఆదుకుంటామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. గురువారం మండలంలో పూనగూడ, మందగూడ, ఉమ్రి, గ్రామాలను సందర్శించారు. నష్టపోయిన కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. ఇండ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించి, కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఉన్నందున అర్హులైన వారికి పక్క ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలు చెట్లు ఇండ్ల మీద పడటంతో అనేక నష్టం జరిగినట్టు తెలిపారు. అదేవిధంగా పంటలు నష్టపోయిన రైతులను, ఆదుకుంటుందని అన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. నష్టపోయిన గిరిజన కుటుంబాలకు తక్షణమే కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ కన్వీనర్ రాజేశ్వర్, వైస్ ఎంపీపీ దివ్య మాధవ్, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, కమలాకర్, వెంకన్న యాదవ్, మాజీ సింగిల్ విండో చైర్మెన్ ప్రకాష్‌రావు, మాజీ సర్పంచ్లు గంగారాం, రఘు, తిరుపతి, మాజీ ఎంపీపీ రాము, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రతాప్, శ్రీనివాస్, దేవ్‌రావు, మోహన్‌రెడ్డి, రాజు, నర్సింలు, జ్ఞానేశ్వర్, కాంతారావు, రాము, రావుల నారాయణ, పోశెట్టి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా మెలగాలి

- మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్



నవతెలంగాణ-భైంసా

మున్సిపల్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని భైంసా మున్సిపాలిటికి చెడ్డ పేరు తెచ్చేలా అధికారులు, ఉద్యోగులు వ్యవహరించవద్దని మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబిర్ అహ్మద్ సూచించారు. బుధవారం కమిషనర్ వెంకటేశ్వర్ రావు, బిల్ కలెక్టర్ విద్యాసాగర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన నేపథ్యంలో గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా మాట్లాడారు. కమిషనర్, వెంకటేశ్వర్లు, బిల్ కలెక్టర్ విద్యాసాగర్, శానిటేషన్ జవాన్ చారి సహకారంతో అక్రమాలకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. సానిటేషన్ జవాన్ చారి సహకారంతో పట్టణంలో నూతన భవన నిర్మాణాల గురించి తెలుసుకోవడం, మున్సిపల్ పాలకవర్గానికి తెలియకుండా నోటీసులు జారీ చేసి బెదిరింపులకు గురి చేసేవారని, ఇందులో భాగంగానే రాదేశ్యాం అనే భవన యజమాని నుంచి రూ.30 వేలు లంచం డిమాండ్ చేయడంతో ఆయన ఏసీబిని ఆశ్రయించారన్నారు. నోటీసులు సైతం మున్సిపల్ కార్యాలయంలో టైప్ చేయించకుండా, బయట నుంచే ఈ తతంగం నడిపినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాగే సానిటేషన్ విభాగంలో పని చేస్తున్న ఐదుగురు రెగ్యులర్ ఉద్యోగులు పనికి రాకున్నా హాజరు నమోదు చేసి వేతనం పొందేలా కమిషనర్ సహకరించారని, తద్వారా వారి నుంచి లబ్ది పొందినట్లు దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు సదరు జవాన్‌ను విధుల నుంచి తప్పించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే విధులకు రాకున్నా వేతనం పొందిన వారి హాజరు వివరాలను కలెక్టర్‌కు వివరిస్తామన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తన దృష్టికి తేవాలన్నారు. మున్సిపల్ ఉద్యోగులు ముడుపులు అడిగితే నేరుగా సంప్రదించాలన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు పాలిసెట్

- హాజరు కానున్న 1059 విద్యార్థులు
- మూడు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- 11 గంటల నుంచి 1.30 వరకు పరీక్ష
- నిమిషం నిబంధన అమలు



కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అబ్జర్వర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు, వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్ డిప్లమోలలో ప్రవేశం కోసం ఈనెల 24న శుక్రవారం నిర్వహించే పాలిసెట్ పరీక్షకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయినట్టు ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా సమన్వయకర్త భరద్వాజ తెలిపారు. గురువారం పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన వివరాలను మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. శుక్రవారం జరిగే పరీక్షకు జిల్లా కేంద్రంలో విద్యార్థి డిగ్రీ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల, ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ముగ్గురు అబ్జర్వర్‌లను కేటాయించినట్టు తెలిపారు. మూడు పరీక్ష కేంద్రాల్లో 1059 విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. గంట ముందు 10 గంటల నుండే విద్యార్థులను లోపలికి అనుమతిస్తామని తెలిపారు. ఒక నిమిషం ఆలస్యమైన లోపలికి అనుమతి ఉండదని తెలిపారు. పదో తరగతి సిలబస్ ఆధారంగా రెండున్నర గంటల పాటు నిర్వహించే పాలీసెట్ ప్రశ్నాపత్రంలో గణితం, భౌతిక, రసాయన, జీవశాస్త్రంలో మొత్తం 150 మార్కుల ప్రశ్నలు, తెలుగు, ఆంగ్లంలో ఉంటాయని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు, ర్యాంకు ఆధారంగా వివిధ పాలిటెక్నిక్ కళాశాలలు, కోర్సులలో అడ్మిషన్స్ ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షకు సంబంధించి ఏర్పాట్లు పూర్తికాగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అలాగే ఏఎన్ఎంలు ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు.

పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లు పరిశీలించిన అబ్జర్వర్

జిల్లా కేంద్రంలో పాలిసెట్ పరీక్ష కేంద్రాన్ని పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు, పాలిసెట్ అబ్జర్వర్ జ్యోత్స్న సందర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనితతో కలిసి రూమ్‌లలో నెంబర్లను వేయించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి



జైనథ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని ప్రతి ఒక్క డీలరు నిబంధనలు పాటించాలని ఏఓ వివేక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విత్తన టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విత్తన డీలర్లు, ఏఈఓలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క ఏఈఓ తమ పరిధిలోని రైతులకి నకిలీ విత్తనాలను గూర్చి తెలియజేయాలన్నారు. రైతులు బిల్లులను తప్పనిసరిగా తీసుకొని భద్రపరిచే విధంగా చైతన్య పరచాలని సూచించారు. డీలర్లు స్టాక్ రిజిస్టర్‌లను విధిగా సమర్పించాలన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టడంలో తమ వంతు బాధ్యత నిర్వహించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్‌లో విత్తన తనిఖీలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్, ఎస్సై వంగ పురుషోత్తం పాల్గొన్నారు.

బేల : మండలానికి సంబందించిన విత్తన డీలర్స్‌లు ఇక్కడి రైతులకు మాత్రమే విత్తనాలను విక్రయించాలని పక్క రాష్ట్రాలు, మండలాలకు విక్రయించవద్దని మండల వ్యవసాయ అధికారి వెండి విశ్వామిత్ర అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో పలు విత్తన దుకాణాలలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పలు విత్తనాల స్టాక్, రిపోర్ట్‌ను పరిశీలించారు. విత్తనాల బిల్లు చేసేటప్పుడు రైతుల పేరు, ఊరుతో పాటు రైతు సంతకం తప్పని సరి తీసుకోవాలని, స్టాక్ రిపోర్ట్ రోజు వారీగా అధికారులకు తెలియజేయాలన్నారు. రైతులు గ్రామాల్లో వచ్చి దొంగ విత్తనాలు అమ్మితే తీసుకోవద్దని, అలా రైతులను ఎవరైనా మోసం చేస్తే తమకు సమాచారం అందిస్తే వారి పైనా చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల టాస్క్‌ఫోర్స్ టీమ్ అధికారులు, తహసీల్దార్ సవాయి సింగ్, ఎస్సై రాధిక, ఏఈఓలు ఉమర్, నగేష్, సాయి, జావేద్ ఉన్నారు.

నేరడిగొండ : మండల విత్తన టాస్క్‌ఫోర్స్ బృంధం మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించింది. స్టాక్ వివరాలు, రిజిస్ట్రర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. దుకాణదారులు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించవద్దని సూచించారు. విత్తనాల లభ్యత, ధరల బోర్డు విధిగా పెట్టాలన్నారు. రైతులకు పూర్తి వివరాలతో కూడిన రశీదు ఇవ్వాలన్నారు. రైతులకు సరిపడ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తనిఖీల అనంతరం మండల విత్తన విక్రయ దారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు నేరడిగొండ రైతు వేదికలో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేవారు. కార్యమంలో బోథ్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీధర్ స్వామి, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ రాములు పాల్గొన్నారు.



జైనథ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేష్



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేష్

నవతెలంగాణ-ఖానాపూర్

ఆర్ఎస్ఎస్, బీజేపీ పాసిస్ట్ ప్రభుత్వం అక్రమంగా చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. గురువారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా ఆపరేషన్ కగారు పేరుతో చతిస్‌ఘడ్ అడవి ప్రాంతాల్లో 120 మందికి పైగా గిరిజనులను బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు చేసిందని ఆరోపించారు. బిజెపి మోడీ, షా ప్రభుత్వం 2024 చివరి వరకు దేశంలో మావోయిస్టు పార్టీని, విప్లవ సంస్థలు లేకుండా చేస్తానని ప్రకటించిందన్నారు. గత 58 సంవత్సరాలుగా దేశంలో పాలకవర్గాలు విప్లవ సంస్థల పార్టీలను లేకుండా చేయుటకు బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో వేలాదిమందిని హత్య చేసిందన్నారు. 16 రాష్ట్రాలలో విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించుటకు బీజేపీ ప్రభుత్వం గిరిజనులపై యుద్ధం ప్రకటించిందని, గిరిజనులను అడవి నుండి వెళ్లగొట్టి ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యం ఉందన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ నాయకులు దుర్గం లింగన్న, గోనె స్వామి, గూట్ల ప్రసాద్, రేగుల గంగన్న, గోగు శేఖర్, మల్లక్క పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుని సూక్తులను అనుసరించాలి

- ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాంతిసందేశాన్ని ఇచ్చిన గౌతమ బుద్ధుని సూక్తులను ప్రతి ఒక్కరు అనుసరించాలని భారతీయ బౌద్ధ మహాసభ సెంట్రల్ కమిటీ శిక్షకులు యువరాజ్ మోరే అన్నారు. గురువారం భారతీయ బౌద్ధ మహాసభ ఆశ్వర్యంలో బౌద్ధ పౌర్ణిమ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో పంచశీల జెండాను ఆవిష్కరించి బౌద్ధ వందన సమర్పించారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ సెంట్రల్ కమిటీ శిక్షకులు యువరాజ్ మోరే మాట్లాడుతూ మానవళికి శాంతి సందేశమిచ్చిన బౌద్ధుడు పౌర్ణిమ రోజునే జన్మించారని తెలిపారు. ఈరోజును బౌద్ధ ఉపకులు పండుగ వాతావరణంలో జరుపుకుంటున్నారు. నెల రోజుల పాటు పట్టణంలోని అశోక బుద్ధ విహార్‌లో శామ్నెర్ శిబిరం కొనసాగిందన్నారు. బుద్ధ పూర్ణి సందర్భంగా దాన్ని ముగించడం జరిగిందని, నెల రోజుల పాటు బుద్ధుని బోధనలు తెలియజేశామని తెలిపారు. కార్యక్రమంలో బౌద్ధ బిక్షులు సరిపుత్త స్వేరో, అనుమదశి, ఆర్య సంఘమిత్ర, భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిరత్న జాడే ప్రజ్ఞకుమార్, జిల్లా అధ్యక్షుడు విఠల్ బుకటే, ప్రధాన కార్యదర్శి దయానంద్, కోశాధికారి కాంతరావ్ వాఘ్మారే. మాజీ అధ్యక్షుడు దయానంద్ కాంబ్లె, రాందాస్, భగవన్, పుమేష్ వాఘ్మారే, మహిళ ఉపాధ్యక్షురాలు కుశ్వర్త లాండ్గె. కార్యదర్శి అమ్రపాల, బేబీ కానిందే, అనిల కిల్లరే పాల్గొన్నారు.



బుద్ధ వందన సమర్పిస్తున్న భారతీయ బౌద్ధ మహాసభ నాయకులు

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్



నవతెలంగాణ-ఖానాపూర్

గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పెంబి, ఖానాపూర్ రెండు మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉదయం 6 గంటల నుండి పారిశుద్ధ పనులు ప్రారంభించాలన్నారు. సానిటేషన్ పనులు 8 గంటల పాటు చేసే విధంగా చూడాలన్నారు. ప్రతి ఎంపీఓ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అంతే కాకుండా 2024-25 సంవత్సరంకు గాను డిమాండ్ ఫిక్స్ చేసి ప్రతి ఇంటికి డిమాండ్ నోటీసులు అందించి కలెక్షన్ చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సానిటేషన్, తాగునీరు, రాత్రి పూట లైటింగ్ పనులు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. కంపోస్ట్ ఎరువులు తయారు చేసి అమ్మాలని గ్రామపంచాయతీలకు ఆదాయం వచ్చే విధంగా చూడాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి రమేష్, ఎంపీడీఓ సునీత, ఖానాపూర్, పెంబి ఎంపీఓలు చంద్రశేఖర్, రత్నాకర్ రావు, రెండు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బుద్దుని మార్గంలో పయనించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మానవాళికి శాంతి సందేశమిచ్చిన బుద్దుని మార్గంలో పయనించాలని బంతే బుద్ధ ఘోష్ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహా విష్కరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో సమాత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో మార్చ్‌ఫాస్ట్ జరిపారు. అనంతరం బౌద్ధ గురువులు అంబేద్కర్ విగ్రహం, పంచశీల జెండాను ఆవిష్కరించారు. మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాతతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బంతే బుద్ధ గోష్ మాట్లాడుతూ శాంతి స్థాపనకు ఎంతగానో కృషి చేసిన గౌతమ బుద్ధుడి అడుగుజాడల్లో నడవాలన్నారు. బుద్ధుడు పుట్టిన రోజును పండగలా జరుపుకుంటున్నట్లు తెలిపారు. గౌతమ బుద్ధుడి సూక్తులను నేటి తరానికి తెలియచేయాలని సూచించారు. కార్యక్రమంలో సమత సైనిక్ దళ్ దక్షిణ భారత సంఘటకులు దీపక్ వాఘ్మరే, కేంద్రీయ సభ్యులు రవిచంద్ర జాబాడే, సహ సంఘటకులు శీలనంద్ కాంబ్లే, హర్షవర్ధన్, రమాకాంత్ కాంబ్లే, మోహన్, అశోక్, మాజీ జడ్పీటీసీ సభ్యులు మాడవి రాజు, వెంకట్ రెడ్డి, ఆరే పోచ్చన్న, రసం కిష్టు, వెంకటి, ప్రభాకర్ రెడ్డి, కేశవ్, వినోద్, దండు మధుకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బాసటగా నిలిచిన యువకులు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఈనెల 19న జన్కపూర్ వద్ద బైక్ ప్రమాదంలో మృతి చెందిన గడ్డం రాకేష్ కుటుంబానికి గ్రామానికి చెందిన యువకులు, గ్రామస్తులు బాసటగా నిలిచారు. రాకేష్ కుటుంబం చాకలి కుల వృత్తి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. మృతుని కుటుంబానికి బుధవారం చేడ్వాయి, మొట్లగూడ, గుంట్లపేట, పొతేపల్లి గ్రామాలకు చెందిన యువకులు, పెద్దలు కలిసి రూ.30 వేల ఆర్థిక సాయం అందచేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన సందర్భంగా పలువురు రాకేష్‌తో తమకు ఉన్న అనుబందాన్ని, సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు.

కళాశాలలో మరమ్మత్తు చేపట్టాలి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదులు, వరండాలో ఫ్లోరింగ్ మరమ్మత్తులు చేపట్టాలని జడ్పీటీసీ వేముల సంతోష్ కోరారు. గురువారం ఇదే విషయమై కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి సంవత్సరం 800 నుండి 900 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం జిల్లాలో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. కళాశాలలో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్ దృష్టి సారించి మరమ్మత్తులకు నిధులు మంజూరు చేసి కళాశాలలు ప్రారంభం కాకముందే సౌకర్యాలు కల్పించాలని కోరారు.

రైతుల సౌకర్యార్థం హెల్ప్‌లైన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో రైతులకు విత్తనాల కొనుగోలులో సమస్యలు ఎదురైనా, విత్తనాల ఎంపికలో సలహాలు సూచనల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా ఎవరైనా నకిలీ విత్తనాల విక్రయించిన 8074812429, 9392779149 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-భైంసా

మండలంలోని మాటేగాం గ్రామానికి చెందిన నల్లోల లక్ష్మణ్ (30) గ్రామ శివారులో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్టు రూరల్ ఎస్సై తెలియజేశారు. లోకేశ్వరం మండలంలోని బిలోలికి చెందిన లక్ష్మణ్ గత మూడు నెలల నుంచి నివాసం ఉంటున్నాడు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లగా శివారులో తుమ్మ చెట్టుకు ఉరేసుకున్న విషయం శుక్రవారం బయటపడింది. మృతుని భార్య భోజవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మహిళల రక్షణే షీటీం కర్తవ్యం

నవతెలంగాణ-నస్పూర్



మహిళల రక్షణ, భద్రతే షీటీం కర్తవ్యమని మంచిర్యాల షీటీం సభ్యులు కానిస్టేబుల్ సతీష్, మహిళా కానిస్టేబుల్ జ్యోతి తెలిపారు. కేజీఏ డిఫెన్స్ అకాడమీ, సీసీసీ నస్పూర్ సేవభవన్‌లోని కరాటే క్లాస్‌లో విద్యార్థిని, విద్యార్థులకు గురువారం షీటీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాల గురించి వివరించి సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఆకతాయిల నుండి మహిళలు, బాలికలకు వేధింపులకు గురైతే రామగుండం షీటీమ్ నంబర్ 6303923700 సంప్రదించాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

గేట్ పరీక్షల్లో ర్యాంకు సాధించిన విద్యార్థికి ఘన సన్మానం

నవతెలంగాణ-జన్నారం

ఇటీవలే వెలువడిన గేట్ పరీక్ష ఫలితాల్లో 181వ ర్యాంకు సాధించి ముంబాయి ఐఐటి కళాశాలలో సీటు సాధించిన జన్నారం పట్టణానికి చెందిన మెరుగు అన్వేష్ గౌడ్‌ను గురువారం మండల కేంద్రంలో గౌడ సంఘం మోకు దెబ్బ ఆధ్వర్యంలో శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బాలసాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పేద గౌడ కుటుంబంలో పుట్టి గేట్ ర్యాంకు సాధించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పోడేటి సతీష్ గౌడ్, ఓల్లాల నర్సాగౌడ్, మెరుగు రమేష్‌గౌడ్, ఓల్లాల వెంకటేశ్వర్‌గౌడ్, ఎరుకల రమేష్‌గౌడ్, గర్రెపల్లి కిషోర్‌గౌడ్, గుండ వెంకటవెంకగౌడ్, కొండ శ్రీనివాస్‌గౌడ్, కొండ గోపాల్‌రావు, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, బూరగడ్డ సత్యగౌడ్ పాల్గొన్నారు.

రాజకీయాల్లో బీసీ కులాలకు సముచిత స్థానం కల్పించాలి

- బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి మనోహర్

నవతెలంగాణ-జైపూర్

బీసీ కులాల వారికి రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలని బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి మనోహర్ డిమాండ్ చేశారు. బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక తహసీల్దార్ సదానందంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ బీసీ కులాల వారికి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని కోరారు. అసెంబ్లీ సాక్షిగా కుల గణనచేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో కుల గణన చేపట్టకుండా స్థానిక సమరానికి సంసిద్ధం కావడం ఏమిటని ప్రశ్నించారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు కావస్తున్నా బీసీలను రాజకీయంగా ఎదుగకుండా తొక్కిపెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 12,751 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తే రాష్ట్ర వ్యాప్తంగా 5355 మంది బీసీ కులాల వారు రాజకీయాల్లోకి రాగలరని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం 2345 మంది మాత్రమే రాజకీయ అవకాశం లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నీరటి రాజన్న, జైపూర్ మండల బాధ్యుడు వేముల మల్లేష్, భీమారం మండల బాధ్యులు గుడిమల్ల వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు వీరగోని రమేష్ గౌడ్, చిర్రం వంశీ, మెండె మల్లేష్, గుడిమల్ల నరహరి, కురిమిళ్ల మల్లేష్, రాస రవితేజ, గొపు సమ్మయ్య, బొంతల లచ్చయ్య, మారం మల్లేష్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నస్పూర్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీరాంపూర్ కాలని కేబుల్ టీవీ ఆపరేటర్ బాస్కరి వెంకటేశం కుటుంబానికి గురువారం నస్పూర్, శ్రీరాంపూర్ ఏరియా కేబుల్ టీవీ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. మృతి చెందిన ఆపరేటర్ బాస్కరి వెంకటేశం కుటుంబ సభ్యులు రాజ్యలక్ష్మి, దీపిక, అక్షయలకు కేబుల్ టీవీ అసోసియేషన్ ద్వారా ఆపరేటర్ల నుంచి సేకరించిన రూ. 21,250లను ఆపరేటర్లు గాండ్ల సత్యం, పంబాల తిరుపతి, రాజేశంలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తోటి ఆపరేటర్ వెంకటేశం మృతి చెందడం విచార కరమన్నారు. అపరేటర్గానే కాకుండా సిటీకేబుల్ కెమెరామెన్‌గా, సామాజిక సేవా కార్యక్రమాల్లో బాగస్వామ్యం అవుతూ అందిరితో కలివిడిగా ఉంటూ మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. వెంకటేష్‌ను కేబుల్ టీవీ ఆపరేటర్లు మరువలేరన్నారు. ఆయన కుటుంబానికి తోటి ఆపరేటర్లు అండగా ఉంటారని పేర్కొన్నారు.

అంతర్జాతీయ స్థాయి ప్రతిభ కనబర్చడం అభినందనీయం

నవతెలంగాణ-నస్పూర్

గోవాలో మే 19న నిర్వహించిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్- 2024 పోటీలలో జిల్లా కేంద్రంలోని జెన్ శిటో-రియు కరాటే స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం మాస్టర్ పోచంపల్లి వెంకటేష్‌తో కలిసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోవాలోని యూనివర్సల్ 369 షోటోకన్ కరాటే ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన మంచిర్యాల జిల్లాకు చెందిన కరాటే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెల్చుకున్నారని తెలిపారు. కె నిహారిక, కె శ్రీనిధి, వి జోష్మిత, ఎం ఆనందన బంగారు పతకాలు, ఎం గౌతమ్, బి సాయి రోహన్, ఎస్ మనీష్‌లు వెండి పథకాలు సాధించారని తెలిపారు.

బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవాలు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లిలో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పడి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాంగా గురువారం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.కోట శివకృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో డాక్టర్ మోహన్ సింగ్ మెహత ఆధ్వర్యంలోని కమిటీ సిఫార్సు మేరకు మొట్టమొదటగా కృషి విజ్ఞాన కేంద్రంను పాండిచ్చేరిలో 21 మార్చి 1974లో స్థాపించడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాలలో 71 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కషి విజ్ఞాన కేంద్రాలు రైతులకు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పరిజ్ఞానాన్ని పెంపొందించి పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాయని తెలిపారు. విత్తనోత్పత్తి, క్షేత్ర పరిశీలనలు, క్షేత్ర ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాల ద్వారా రైతులు ఆర్థిక స్వలంమన సాధించే విధంగా కృషి చేస్తున్నట్టు వివరించారు. వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతపైన అవగాహన పెంపొందించడమే కృషి విజ్ఞాన కేంద్రాల లక్ష్యంమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు మేలైన కంది విత్తనాన్ని అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా ప్రియసుగంధి, డా తిరుపతి, నాగరాజు పాల్గొన్నారు.

అలరించిన కైతల ఎన్నీల

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ లోని సీనియర్ కవి, కళాకారుడు బోనగిరి రాజిరెడ్డి ఇంటి ఆవరణలో తెలంగాణా రచయితల వేదిక మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో కైతల ఎన్నీల కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా తెలుగు సినీ గేయ సాహిత్యంపై జిల్లాకు చెందిన సినీ విశ్లేషకులు తుమ్మల లక్ష్మారెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గేయ రచన అంత సులువైన పని కాదని, అందులో అనేక మంది శ్రోతలు అనేక మార్లు వినబోయే గీతాలను రచించడానికి మాతృ ప్రసవ వేదనతో సమానమైన నొప్పిని గీత రచయిత అనుభవిస్తాడు అన్నారు. తెరవే మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు తోకల రాజేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవులు నాగవర్మ ముత్యం, బొలిశెట్టి నాగేంద్ర, అక్కల చంద్రమౌళి వర్మ అల్లాడి శ్రీనివాస్, పెంచాల శ్రీనివాస్, జంబోజీ సత్తయ్య పాల్గొన్నారు.

మోడల్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య తెలిపారు. ఈ నెల 25వ తేదిలోపు ఇంటర్ ప్రవేశాల కోసం టీఎస్‌మొడల్‌స్కూల్స్.కామ్ వెబ్ సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇంటర్లో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులలో 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతిలో పొందిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఇంగ్లీష్ మీడియంలో ఉచిత విద్యతో పాటు ఉచితంగా యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, ఒకేషనల్ విద్యా బోధన, డిజిటల్ పద్ధతిలో విద్యా బోధన, బాలికలకు హాస్టల్ వసతి కలదన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లాలోని పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పనులు పరిశీలించి.. కూలీలతో మాట్లాడి..

- కూలి దినాలు సద్వినియోగం చేసుకోవాలి
- స్పెషల్ కమీషనర్ షఫీయుల్లా



భీమారంలో ఈజీఎస్ కూలీలతో మాట్లాడుతున్న కమీషనర్

నవతెలంగాణ-జైపూర్

జైపూర్, భీమారం మండలాల్లో పర్యటించిన స్పెషల్ కమీషనర్ గ్రామీణ ఉపాధి హామీ పనుల నిర్వాహణ తీరును పరిశీలించారు. భీమారం మండల కేంద్రంలో చెరువు పూడిక పనులకు హాజరైన కూలీలతో మాట్లాడారు. పనుల నిర్వాహణలో నిర్దేషిత కొలతలపై అవగాహన కలిగివుండి కూలి గిట్టుబాటు చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించిన ఆయన కూలీల హాజరు శాతం అడిగి తెల్సుకున్నారు. హాజరు ఏవిధంగా వేస్తున్నారు.. కూలి గిట్టు బాటుకు ఏ మేరకు పనులు పనులు చేయాలని కూలీలను అడిగి తెల్సుకున్నారు. కాగా చెరువులో తీస్తున్న పూడికను రైతులు పంట పొలాల్లో వినియోగించుకోవాలని తెలిపారు. కూలీలకు అందుబాటులో ఉండి నిర్దేషిత కొలతలతో పనుల నిర్వాహణ కొనసాగాలని అన్నారు. అనంతరం పని స్థలంలో ఏర్పాటు చేసిన గ్రీన్ షెడ్డు, తాగు నీటి వసతి పరిశీలించారు. అదేవిధంగా భీమారం గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని సంధర్శించిన ఆయన మొక్కలు పెంచుతున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జూన్ మొదటి వారం వరకు నాణ్యమైన మొక్కలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా జైపూర్ గ్రామంలో సేకరించిన వ్యర్థాలతో ఉత్పత్తి అవుతున్న కంపోస్టు ఎరువును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైపూర్ మండల కేంద్రంలో సెగ్రిగేషన్ షెడ్డును సందర్శించిన ఆయన కంపోస్టు ఎరువు తయారు చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయనతోపాటు డీఆర్‌డీఓ కిషన్, డీపీఓ వెంకటేశ్వర్‌రావు, జైపూర్ ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణగౌడ్, భీమారం ఎంపీడీఓ రాధా రాథోడ్, అదనపు పీడీ పాల్గొన్నారు.



జైపూర్‌లో సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలించిన కమీషనర్

సంపూర్ణ మానవ వికాసమే బుద్ధ దర్మం

- అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రపంచ మానవాళికి బుద్ధుడి బోధనలే శరణ్యమని, సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహలే ఆయన బోధనలని, బుద్ధుడు చూపిన దర్మం ద్వారానే సంపూర్ణ మానవ వికాసం కలుగుతుందని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు అన్నారు. గురువారం అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇటిక్యాలలో బుద్ధుడి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెడు ఆలోచనలు, చెడు ప్రవర్తనకు దూరంగా ఉండడం వల్ల సామజిక శాంతి నెలకొంటుందని, మనుషుల దుఃఖానికి కారణం కోరికలేనని వాటిని అదుపులో పెట్టుకుంటే జీవితాన్ని జయించవచ్చని బుద్ధుడు బోదించాడన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బైరం లింగన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, ఉపాధ్యక్షుడు కండె మొగిలి, కిరణ్, వేల్పుల సాయి తొగరు ఉదయ్, చాతరాజు రాజశేఖర్, చెన్న రాజేష్, మహేష్, రాజకుమార్, సిద్దు పాల్గొన్నారు.

తాండూర్ : బెల్లంపల్లి పట్టణంలోని సంఘమిత్ర ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను ప్రజలకు తెలియజేస్తూ సంఘమిత్ర ధ్యాన కేంద్రం నుండి కూరగాయల మార్కెట్ మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాస్టర్ ఏలేటి లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి వ్యక్తి ధ్యాన సాధన చేయాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ధ్యానం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు. ధ్యాన సాధన వల్ల పంచేంద్రియాలపై పట్టు లభిస్తుందని తెలిపారు. ప్రతినిత్యం ధ్యాన సాధన చేసే వ్యక్తి రోగ రుగ్మతలు లేని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చునన్నారు. బుద్ధుని అష్టాంగ మార్గాలను గురించి తెలియజేశారు. సరియైన దృక్పదాలు సంకల్పాలు, సరియైనవాక్కు సరి అయిన కర్మ, జీవనోపాయం, శ్రద్ధ, ఏకాగ్రత సరియైన ధ్యానం వల్ల సుఖశాంతమైన జీవన విధానం అలవడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ శంకరయ్య, యాదగిరి మనోహర్, మల్లేష్ పాల్గొన్నారు.



ఐటీ ఆప్షన్ తేదీని పొడిగించాలి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కార్మికుల ఇన్కమ్ టాక్స్‌కు సంబంధించిన ఆప్షన్ తేదీని పొడిగించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు, శాశ్వత వేజ్ బోర్డ్ సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం ఆర్కే న్యూటెక్ గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి కార్మికులు ఇన్కమ్ టాక్స్ సంబంధించిన ఆప్షన్ ఎన్నిక కోసం పాత పద్ధతి లేక కొత్త పద్ధతినే కొనసాగించడానికి అన్ని గనులపై, డిపార్ట్‌మెంట్లలో పనిచేసే కార్మికులు అంగీకార పత్రాలను ఇవ్వాల్సి ఉందని కానీ యాజమాన్యం ఈ విషయాన్ని కార్మికులలో ప్రచారం చేయకపోవడంతో కార్మికులు తమ అంగీకార పత్రాలను ఇవ్వలేకపోయారని అన్నారు. ఇప్పుడు అంగీకార పత్రాలు ఇస్తే సింగరేణి యాజమాన్యం అధికారులు పత్రాలు ఇవ్వాల్సిన తేదీ అయిపోయిందని చెబుతున్నారని, దీనివల్ల కార్మికులకు భవిష్యత్తులో ఇన్కమ్ టాక్స్ ఇబ్బందులు ఏర్పడే అవకాశాలున్నందున వెంటనే యాజమాన్యం అంగీకార పత్రాలు ఇచ్చేలా గనులు, డిపార్ట్‌మెంట్లలో ప్రచారం చేసి కార్మికులు తమ అంగీకార పత్రాన్ని ఇచ్చేందుకు గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంగా తమ దృష్టికి వచ్చిన ఏ సమస్యనైనా వెంటనే యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, సంఘం సదానందం, గొల్లపల్లి రామచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు గజ్జి రమేష్, సందీప్, చంద్రమౌళి, అక్రం పాషా, రాజయ్య, సిద్ధం అజయ్, శ్రీకాంత్, షాకీర్, తోట మహేష్ పాల్గొన్నారు.

లింగ నిర్థార్ధణ పరీక్షలు నేరం : డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-నస్పూర్

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, పరీక్షలు నిర్వహించినా చేసుకున్నా, ప్రోత్సహించినా వారిపై చట్టరీత్య చర్యలుంటాయని డీఎంహెచ్ఓ డా. అనిత అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన కార్యాలయంలో శాఖ అధికారులు, వైద్యాధికారులతో కలిసి జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పీసీపీఎన్‌డీటీ చట్టం కింద 45 స్కానింగ్ ఆస్పత్రులున్నాయని, 12 ఆస్పత్రులు రెన్యువల్ కోసం, 2 ఆస్పత్రులు కొత్తగా స్కానింగ్ సెంటర్ల మంజూరుకు పీసీపీఎన్‌డీటీలో నమోదు చేసున్నారన్నారు. జిల్లాలోని కళాశాలల, శిక్షణ కేంద్రాలు, దిశా కార్యక్రమాలు, గ్రామపంచాయతీలలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షల నిరోధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడిన వారికి 3 సంవత్సరాల జైలు శిక్ష విధించబడుతుందన్నారు. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలిస్తే 104కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అనంతరం లింగ నిర్ధారణ పరీక్షల నిషేధంపై ముద్రించిన గోడప్రతుల విడుదల చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డా.నీరజ, వైద్యులు డా. రాధిక, డా.కోటేశ్వరరావు, డా.సుధాకర్, డా.రాజ్ కిరణ్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని లంబాడితండా(కే) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బోడ శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బీఆర్ఎస్ సభ్యత్వంతో మంజూరైన ఇన్సూరెన్స్ రూ.2 లక్షల చెక్కును బోడ శంకర్ భార్య బోడ శారదకు అందజేశారు. ఈ చెక్కును జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలమని, అలాంటి కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతల భీమయ్య, బానోత్ రాజేష్, మదన్ లాల్, రాజు, గోపాల్, శ్రీను పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చందాపూర్ దిగాంబర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాల కళాశాలలో ఫీజుల దోపిడిని అరికట్టాలని అన్నారు. అదేవిధంగా ఫీజులో నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా కొన్ని బడా ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని అన్నారు. అడ్మిషన్లు చేయడమే కాకుండా రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అదేవిధంగా ఫీజులు హద్దు లేకుండా మితిమీరి పెంచుతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి జలగలాగా పట్టిపీడిస్తున్నారని , పేద విద్యార్థుల రక్తం తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ సంవత్సరం పూర్తి చేసిన పదో తరగతి విద్యార్థుల దగ్గర నుంచి టీసీ, స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ రూపంలో పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని విమర్శించారు. దాంతోపాటు జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీంలో సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల విద్యార్థులకు 25 శాతం ఉచితంగా విద్యను అందించాలని అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు సతీష్ పాల్గొన్నారు.

మే 31లోగా మరమ్మత్తు పనులు పూర్తిచేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో భాగంగా చేపడుతున్న మరమ్మత్తు పనులను మే 31లోగా పూర్తిచేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ రివ్యూ మీటింగ్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మఆదర్శ పాఠశాల కమిటీకి వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకొని, పాఠశాలల రూపురేఖలు మార్చాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాల, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్‌లలో టాయిలెట్స్ మరమ్మతులు, పెయింటింగ్, మౌళిక వసతుల పనులన్ని నాణ్యతగా ఉండాలని అదేవిధంగా వర్షాలు కురిసే సమయాల్లో లీకేజీలు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో చేపడుతున్న పనులన్నింటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అత్యవసరమైన పనులను గుర్తించి వాటిని చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఎక్కడెక్కడ రిపేర్స్, మేజర్ పనులు అవసరమో ఆ వివరాలు సమర్పించడం జరిగిందని దానికనుగుణంగా పనులు చేపట్టాలని, ఇంకా పనులు ప్రారంభించని చోట త్వరగా ప్రారభించి, పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీఓ, ఈఈ, ఎంఈఓ, ఏపీఎంలు టీమ్‌గా వెళ్లాలని సూచించారు. ఈజీఎస్‌లో చేపడుతున్న పనులపై దృష్టి సారించాలని, ముఖ్యంగా టాయిలెట్స్ మరమ్మత్తులు, నిర్మాణ పనులపై డీపీఓ, సీఈఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పనులలో నిర్లక్ష్యం వహించిన, గడువులోగా పనులు జరగకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖఅధికారి ప్రణీత, డీపీఓ, డీఎల్పీఓఎస్, డీడీటీడబ్ల్యూ, ఎంఈఓఎస్, పెయింటింగ్స్ ఏజెన్సీస్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓలు, ఎంపీఓ, ఈఈలు, డిఈఈలు, ఏఈఈ లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

- 14 కేంద్రాల్లో 5871 మంది విద్యార్థులు
- డీఐఈఓ రవీందర్ కుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఈ మేరకు పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేసినట్టు డీఐఈఓ రవీందర్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో పరీక్షలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా కేంద్రాల్లో వసతులు కల్పించడం జరిగిందన్నారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు మద్యాహ్నం నుంచి ఉండటంతో వైద్యారోగ్య శాఖ సహకారంతో ఏఎన్ఎంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామన్నారు.

ఎండల దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు

మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నిమిషాల నుంచి సాయంత్రం 5.30 వరకు ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరంలో 3,420, రెండో సంవత్సరంలో 2,451 మంది విద్యార్థులు ఉండగా మొత్తం 5,871 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీరికోసం ఆదిలాబాద్‌లో ఆరు, ఇచ్చోడలో రెండు, ఉట్నూర్‌లో రెండు, నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఇంద్రవెల్లి, బోథ్ మండల కేంద్రాల్లో ఒక్కోటి చొప్పున మొత్తం జిల్లా వ్యాప్తంగా పరీక్ష 14 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు కచ్చితంగా హాల్ టికెట్ వెంట తీసుకురావాలని సూచించారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటిస్తు రావాలని కోరారు.

సమాజ హితకాలు.. తెలుగు శతకాలు

భైంసా : సమాజంలో సామాజిక ఆధ్యాత్మిక విలువలను అందించడంలో శతకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రముఖ కవి జాధవ్ పుండలిక్ రావు పాటిల్ అన్నారు. గురువారం నిర్మల్ శతక కవి మడిపల్లి వీరయ్య జయంతిని పురస్కరించుకొని పట్టణములోని శ్రీ గౌతమీ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన సాహిత్య గోష్ఠిలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలుగు శతకాలు సమాజ హితకాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కవయిత్రి సవిత దేశ్ పాండే, తెలుగు భాషాభిమానులు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొని, వీరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.